


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 227, పేజీలు - 08

ఆదివారం, ఫిబ్రవరి 1, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





## వాయిస్ ఆఫ్ హార్వర్డ్

### - విద్యార్థులతో సీఎం రేవంత్ ముఖాముఖి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రం కేంబ్రిడ్జ్–బోస్టన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన హార్వర్డ్ యూనివర్సిటీ కార్యక్రమాలను ఉత్సాహంగా ముగించారు. చివరి రోజున ఆయన హార్వర్డ్ బిజినెస్ స్కూల్, ఎంఐటీ , కొలంబియా యూనివర్సిటీలకు చెందిన భారతీయ విద్యార్థులు, పూర్వ విద్యార్థుల బృందాలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నాయకత్వ లక్షణాలు, ఆర్థికాభివృద్ధి నమూనాలు, పర్యావరణ పరిరక్షణ , రైతు సంక్షేమం వంటి విభిన్న అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సీఎం తనదైన శైలిలో సమాధానాలిచ్చారు. ముఖ్యంగా మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పనపై తనకున్న ఆలోచనల్ని వారితో

2లో..



## మున్సిపల్ ఎన్నికలకు

# కాంగ్రెస్ స్ట్రాటజీ

- రెబల్స్ బెడద లేకుండా చూడాలన్న రేవంత్
- గెలిచేవాళ్లకే టికెట్లు ఇవ్వాలని సూచన
- చైర్మన్, మేయర్లను అప్పుడే ప్రకటించొద్దు
- మంత్రులకు సీఎం రేవంత్ కీలక సూచనలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటిన హస్తం పార్టీ పట్టణపోరులోనూ అదే రిపీట్ చేయాలనుకుంటుంది. ఈ మేరకు వ్యూహాలకు పదునుపెడుతోంది. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుండే సమీక్షా సమావేశం నిర్వహించారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ ఏర్పాటు చేయగా అందులో సీఎం రేవంత్ రెడ్డి సైతం పాల్గొన్నారు. ఈ జూమ్ మీటింగ్‌లో జిల్లాల ఇన్ ఛార్జ్ మంత్రులు, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ మీనాక్షి చౌదరి పాల్గొన్నారు.మున్సిపల్ ఎన్నికల నివేదికను మంత్రులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికలపై సీఎం మంత్రులకు కీలక సూచనలు చేశారు. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 90శాతం స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని టార్గెట్ నిర్దేశించారు. ఎక్కడా కూడా రెబల్స్ బెడద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా రెబల్స్ బరిలో ఉంటే వారితో మాట్లాడని ఫిబ్రవరి 3న నామినేషన్లకు తుది గడువు ఉండటంతో ఆ లోపు వారితో విత్‌డ్రాలు చేయించాలని ఆదేశించారు. ఎక్కడ కూడా రెబల్స్ పోటీలో ఉండొద్దని అలా ఉంటే పార్టీకి ప్రమాదమని హెచ్చరించారు. టికెట్లు రాని వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అందరికీ అడంగా ఉంటుందని నాయకులకు తగిన ప్రతిఫలం దక్కుందని చెప్పారు.ఇదిలా ఉండగా తెలంగాణలో ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరనున్నాయి. ఫిబ్రవరి 13న కౌంటింగ్, ఫిభ్రవరి 16న మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది.

ఈ నెల 28న నామినేషన్ల ప్రక్రియ మొదలవ్వగా జనవరి 30న ముగిసింది. ఫిబ్రవరి 3న విత్ డ్రాలకు అవకాశం కల్పించగా చాలా చోట్ల రెబల్స్ బరిలో నిలిచారు. ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, బీజేపీలు, ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఎలాగానై పట్టునిలుపుకోవాలని అన్ని పార్టీలు భావిస్తున్నాయి.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా

# సునేత్రా పవార్ ప్రమాణం

### - తొలి మహిళగా రికార్డు



**ముంబై (ప్రశ్న న్యూస్)** మహారాష్ట్రలో తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా 62 ఏళ్ల సునేత్రా పవార్ ప్రమాణం చేశారు. మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్, సునేత్రా పవార్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఇటీవల బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందడంతో ఆయన భార్య సునేత్రా పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. వారి కుమారుడు పార్థ్ పవార్‌కు రాజ్యసభ సీటు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ రాజకీయ వారసురాలిగా ఆమెను నిలబెట్టడం ద్వారా పార్టీపై పట్టు సాధించాలని ఎన్సీపీ వర్గం భావిస్తోంది. అదే సమయంలో శరద్ పవార్ వర్గంతో విలీనంపై చర్చలు కూడా కొనసాగుతుండటం గమనార్హం. అజిత్ పవార్ మరణం తర్వాత ఎన్సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్రా పవార్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ సీనియర్ నేత

2లో..

# కుప్పం గడ్డపై గిన్నిస్ రికార్డ్

### - 5555 ఈ-సైకిళ్ల పంపిణీతో సరికొత్త చరిత్ర

- ఏపీలో ఇ-సైకిళ్లపై రూ.10 వేల రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- కుప్పంలో 3 కిలోమీటర్లు ఇ-సైకిల్ నడిపిన సీఎం చంద్రబాబు
- రూ.35 వేల సైకిల్‌ను రూ.25 వేలకే పొందే అవకాశం
- ఇ-మోటరాడ్ సంస్థతో ఒప్పందం.. కుప్పంలోనే అసెంబ్లింగ్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్లవాత్మక అడుగు వేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన సొంత నియోజకవర్గం కుప్పంలో 5,555 ఇ–సైకిళ్లను డ్వాక్రా మహిళలు, ఇతర లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కేవలం 24 గంటల వ్యవధిలో ఇంత భారీ సంఖ్యలో ఎలక్ట్రిక్ సైకిళ్లను పంపిణీ చేయడం ద్వారా ఈ కార్యక్రమం గిన్నీస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. గిన్నీస్ ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో రికార్డుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా కలెక్టర్ అందుకున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. శాంతిపురం మండలం శివపురంలోని తన నివాసం నుంచి తూంసీ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభా స్థలి వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర ఆయన స్వయంగా ఇ–సైకిల్ తొక్కారు. వేలాది మంది మహిళలు తమ ఇ–సైకిళ్లతో

2లో..

## గోడకు నోటీసులు అంటించడం

# చట్టవిరుద్ధం

### - సిట్‌కు కేసీఆర్ 6 పేజీల ఘాటు లేఖ

- సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం
- నా గౌరవానికి భంగం కలిగించారు - విచారణకు సహకరిస్తానన్న కేసీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ జూబ్లీహిల్స్ ఏసీపీ పి. వెంకటగిరి జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. తన నందినగర్ నివాసం గోడపై నోటీసు అతికించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆరు పేజీల సుదీర్ఘ లేఖను రాశారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి ఇచ్చే నోటీసులను ఇలా బహిరంగంగా గోడకు అతికించడం చట్ట విరుద్ధమని, ఇది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించడమేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. పోలీసుల ఈ చర్య కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని ఆయన హెచ్చరించారు.

లేఖలో కేసీఆర్ ప్రధానంగా న్యాయపరమైన అంశాలను ప్రస్తావించారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారి నివాసం వద్దే విచారించాలని సీఆర్‌పీసీ సెక్షన్ 160 స్పష్టంగా చెబుతోందని గుర్తు చేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారణ జరపాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే,

2లో..

## మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం

### -బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సయోధ్య కోరుకుంటోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమేం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ పట్ల ప్రధాని నరేంద్ర మోదీ చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. గతంలో తెలంగాణ పుట్టుకనే ఆయన అవమానించారని ఆవేదన

2లో..

# చంద్రబాబు కుటుంబం రూ.5 వేల కోట్ల విలువైన భూములను లాగేసుకుంది



- అధికార దుర్వినియోగంతో ఎంపీ భరత్‌కు రుషికొండ భూములు కట్టబెట్టారన్న జగన్
- జీవీఎంసీలో వైసీపీ కార్పొరేటర్లపై దాడులు చేసి తీర్మానం నెగ్గించుకున్నారని ఆరోపణ
- చంద్రబాబు, లోకేష్ పాలనను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేశారని విమర్శ

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబంపై వైసీపీ అధినేత జగన్ సంచలన ఆరోపణలు చేశారు. విశాఖపట్నంలో సుమారు రూ.5,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అధికార దుర్వినియోగంతో కబ్జా చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు హలో ఇండియా.. ఇది ఒక వేక్–అప్ కాల్" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు కుటుంబం సాగిస్తున్న భూ దోపిడీని దేశం గమనించాలని కోరారు. రుషికొండ సమీపంలో ఉన్న 54.79 ఎకరాల అత్యంత విలువైన భూమిని చంద్రబాబు తన కుటుంబ సభ్యుడైన విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు అక్రమంగా

2లో..

## వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం

### - నేడే కేంద్ర బడ్జెట్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటులో 2026–27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక

2లో..



## ఇరాన్ బందర్ అబ్బాస్ పోర్టులో

# భారీ పేలుడు

### - ఏనిమిది అంతస్తుల భవనంలో పేలుడు

**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** ఇరాన్ నగరం బందర్ అబ్బాస్‌లోని ఒక భవనంలో శనివారం భారీ పేలుడు సంభవించింది. నగరంలోని మోలెం బౌలేవార్డ్ ప్రాంతంలోని ఎనిమిది అంతస్తుల భవనంలో పేలుడు సంభవించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ పేలుడుకు భవనంతో పాటు పలు వాహనాలు, దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఈ పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇరాన్

2లో..



## కోఠిలో కాల్పుల

# కలకలం

- దుండగుల కాల్పుల్లో బట్టల వ్యాపారి రిన్షద్ మృతి
- రూ.6 లక్షల నగదు, బైక్‌తో పరారైన నిందితులు
- పక్కా రెక్కీతోనే దాడి జరిగినట్లు పోలీసుల అనుమానం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టించిన కోఠి కాల్పుల ఘటనపై ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి కీలక వివరాలు వెల్లడించారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బట్టల వ్యాపారి రిన్షద్ మృతి చెందినట్లు ఆమె స్పష్టం చేశారు. నగరంలో పట్టపగలే జరిగిన ఈ దారుణ ఘటన వివరాలను ఆమె మీడియాకు వివరించారు. డీసీపీ శిల్పవల్లి కథనం ప్రకారం, నాంపల్లికి చెందిన బట్టల వ్యాపారి రిన్షద్, రూ.6 లక్షల నగదు డిపాజిట్ చేసేందుకు కోఠిలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వచ్చారు. ఉదయం 6:50 నుంచి 7 గంటల మధ్యలో, రిన్షద్ డబ్బు డిపాజిట్ చేస్తుండగా స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పులతో రిన్షద్ అక్కడికక్కడే కుప్పకూలిపోయారని, ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారని ఆమె తెలిపారు. దాడి అనంతరం నిందితులు, రిన్షద్ వద్ద ఉన్న రూ.6 లక్షల

2లో..

# వాయిస్ ఆఫ్ హార్వర్డ్

పంచుకున్నారు.

### ప్రొఫెసర్‌ను కాదు.. నిరంతర విద్యార్థిని!

ఈ సమావేశంలో ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఒక విద్యార్థుల బృందం తమకు లీడర్‌షిప్ – విజన్ గురించి పాఠాలు చెప్పాలని సీఎంను కోరగా, ఆయన భిన్నంగా స్పందించారు. హార్వర్డ్‌లోని మేధావులైన ప్రొఫెసర్లు ఉండగా, నేను ఇక్కడ ప్రొఫెసర్‌గా పాఠాలు చెప్పాలనుకోవడం లేదు. నేను కేవలం మీతో చర్చించి, విషయాలను పంచుకుంటూ నేర్చుకోవడానికి ఇష్టపడతాను అని వ్యాఖ్యానించారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా, నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్న ఆయన మాటలు అక్కడి విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

### తెలంగాణ రైజింగ్ గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్లుగా యువత

భారతదేశ భవిష్యత్తుపై తనకున్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ, ముఖ్యంగా తెలంగాణ, హైదరాబాద్ నగరాలు దేశానికే ఆదర్శంగా నిలవబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తన ప్రభుత్వ విజన్‌ను ఆయన వివరించారు. విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులంతా తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, రాష్ట్ర ప్రగతిని ప్రపంచానికి చాటిచెప్పే బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు. దీనికి స్పందించిన అనేకమంది విద్యార్థులు, తాము నేర్చుకున్న విజ్ఞానంతో తెలంగాణ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

### సర్టిఫికేట్ అందుకున్న తొలి సీఎం

హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో లీడర్‌షిప్ ఇన్ ది 21 సెంచరీ అనే ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌ను రేవంత్ రెడ్డి విజయవంతంగా పూర్తి చేశారు. మైనస్ 24 డిగ్రీల గడ్డకట్టే చలిలోనూ ఏడు రోజుల పాటు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, అసైన్‌మెంట్‌లు పూర్తి చేసిన ఆయన పదవిలో ఉండగానే హార్వర్డ్ నుంచి సర్టిఫికేట్ పొందిన దేశంలోనే తొలి ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. 20 దేశాల ప్రతినిధులతో కలిసి ఆయన చేసిన ఈ విద్యాభ్యాసం, తెలంగాణ పాలనలో అంతర్జాతీయ ప్రమాణాలను తీసుకురావడానికి ఎంతగానో దోహదపడుతుందని రేవంత్ నమ్ముతున్నారు.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్రా పవార్ ప్రమాణం

ఛగన్ భుజబల్ సునేత్రా పవార్ పేరును ప్రతిపాదించగా ఇతర ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సిఫార్సు మేరకు గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సునేత్రా పవార్‌కు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. బారామతిలో బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ సహా మొత్తం ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే. ఈ విషాద సమయంలోనే ఎన్సీపీ పగ్గాలు చేపట్టాలని సునేత్రా పవార్‌ను ఆ పార్టీ వర్గాలు ఒప్పించాయి. ఎన్సీపీలో శరద్ పవార్ ఆధిపత్యాన్ని అడ్డుకోవాలంటే అజిత్ పవార్ రాజకీయ వారసురాలిగా సునేత్రా పవార్‌ను నిలబెట్టాలని అజిత్ పవార్ ఎన్సీపీ నేతలు ఈ నిర్ణయం తీసుకున్నారు.అయితే విడిపోయిన ఎన్సీపీ రెండు వర్గాలు, తిరిగి విలీనం అవుతాయని దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని ఇప్పటికే శరద్ పవార్ తేల్చి చెప్పారు. అయితే తాను నేరుగా చర్చల్లో పాల్గొనడం లేదని జయంత్ పాటిల్, అజిత్ పవార్ మధ్య ఇప్పటికే డిసెంబర్, జనవరి నెలల్లో చర్చలు జరిగాయని, ఫిబ్రవరిలో విలీన ప్రక్రియ ఉండగా ఈ విషాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. అయితే సునేత్రా పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా నియమిస్తున్నారన్న వార్తలపై స్పందించిన శరద్ పవార్ తనకు ఈ విషయం ముందే తెలియదని స్పష్టం చేశారు.

## కుప్పం గడ్డపై గిన్నిస్ రికార్డ్

ముఖ్యమంత్రిని అనుసరిస్తుండగా, ఆ ప్రాంతమంతా సైకిల్ నినాదాలతో హోరెత్తింది. ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటేశారని, అందుకే అభివృద్ధి అంటే ఏంటో సైకిల్ వేగంతో చేసి చూపిస్తున్నామని చంద్రబాబు ఉత్సాహంగా వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం మేక్ ఇన్ కుప్పం . ప్రముఖ సంస్థ ఇ-మోటరాడ్ భాగస్వామ్యంతో కుప్పంలోని స్థానిక యూనిట్ లోనే ఈ సైకిళ్లను అసెంబ్లింగ్ చేస్తున్నారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి లభించడమే కాకుండా, సాంకేతికత గ్రామీణ స్థాయికి చేరువైంది. ఈ సైకిళ్లను ఇంటిపై ఉండే సోలార్ విద్యుత్ ద్వారా ఉచితంగా ఛార్జింగ్ చేసుకోవచ్చని, ఒక్క పైసా ఖర్చు లేకుండా మహిళలు తమ పనుల కోసం వీటిని వాడుకోవచ్చని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సైకిల్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే దాదాపు 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. రూ. 24 వేల విలువైన ఈ సైకిళ్లను ప్రభుత్వం భారీ సబ్సిడీతో కేవలం రూ. 5 వేలకే లబ్ధిదారులకు అందజేస్తోంది. దీనివల్ల గ్రామీణ మహిళల రవాణా కష్టాలు తీరడమే కాకుండా, వారి ఆర్థిక పురోగతికి ఇవి ఎంతగానో తోడ్పడతాయని ప్రభుత్వం భావిస్తోంది. కుప్పం నుంచి ప్రారంభమైన ఈ గ్రీన్ మొబిలిటీ విప్లవం త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

## గోడకు నోటీసులు అంటించడం చట్టవిరుద్ధం

సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఏపీ హైకోర్టులోని వీడీ మూర్తి కేసు తీర్పును కూడా ఉటంకిస్తూ, నివాసం ఉంటున్న చోటే విచారణ జరపాలని పార్లమెంట్ చేసిన చట్టాన్ని పోలీసులు బేఖాతరు చేస్తున్నారని విమర్శించారు.పోలీసులు తన ఎన్నికల అఫిడవిట్ లోని చిరునామాను సాకుగా చూపడాన్ని కేసీఆర్ తప్పుబట్టారు. అఫిడవిట్ లోని చిరునామాకు, సెక్షన్ 160 నోటీసులకు సంబంధం లేదని, ఒక వ్యక్తి ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారో ఆ ప్రాంతానికే నోటీసులు పంపాలని చట్టం చెబుతోందని వెల్లడించారు. హరీష్ రావు వంటి ఇతర నేతల విషయంలో ఒకలా, తన విషయంలో మరోలా పోలీసులు డబుల్ స్టాండర్డ్స్ పాటిస్తున్నారని ఆయన మండిపడ్డారు. భవిష్యత్తులో తనకు పంపే ఏ నోటీసులైనా ఎర్రవల్లి చిరునామాకే పంపాలని, చట్టవిరుద్ధంగా ఇచ్చిన నోటీసులను తాను విస్మరించవచ్చని కూడా ఆయన ఘాటుగా స్పష్టం చేశారు.అక్రమ పద్ధతిలో నోటీసులు ఇచ్చినప్పటికీ, ఒక బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా తాను విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని కేసీఆర్ ప్రకటించారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు తాను సిద్ధమని, నందినగర్ నివాసంలోనే అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు. అయితే, ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని కూడా ఆయన లేఖలో స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని, చట్టపరంగా అన్ని అంశాలను ఎదుర్కొంటానని ఆయన తన లేఖ ద్వారా పోలీసులకు, ప్రభుత్వానికి గట్టి సంకేతాలు పంపారు

## కోఠిలో కాల్పుల కలకలం

నగదుతో పాటు అతని బైక్‌ను కూడా తీసుకుని పరారయ్యారని వివరించారు.ఈ ఘటనపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని, నిందితులను పట్టుకునేందుకు 5 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు డీసీపీ తెలిపారు. ఘటనా స్థలంలో రెండు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు చాదర్‌ఘాట్ వైపు వెళ్లినట్లు గుర్తించామని చెప్పారు. రిన్షద్ కదలికలపై ముందుగానే రెక్కీ నిర్వహించి, పక్కా ప్రణాళికతోనే ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులు నగరం విడిచి వెళ్లకుండా పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. నగర నడిబొడ్డున జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమైంది.

## చంద్రబాబు కుటుంబం రూ.5 వేల కోట్ల విలువైన భూములను లాగేసుకుంది

కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేసిన ఈ భూములను ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉచితంగా బహుమానంగా ఇచ్చిందని ధ్వజమెత్తారు. నారా లోకేశ్ కు ఎలాంటి అధికార పరిధి లేకపోయినా, విద్యాశాఖ ద్వారా ఒక మెమో జారీ చేయించి తన తోడల్లుడికి భూములు కేటాయించేలా చక్రం తిప్పారని జగన్ మండిపడ్డారు. ఇది చంద్రబాబు కుటుంబ కుట్రలో భాగమేనని విమర్శించారు.ఈ భూ కేటాయింపు తీర్మానాన్ని ఆమోదింపజేయడానికి చంద్రబాబు తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడ్డారని జగన్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సభ్యులను భయపెట్టి ఏకపక్షంగా ఆమోదించుకున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు ప్రయత్నించిన వైసీపీ కార్పొరేటర్లపై భౌతిక దాడులు చేసి, బలవంతంగా బయటకు పంపించారని, ఈ దాడుల్లో పలువురు గాయపడినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని తెలిపారు. ఈ భూ దోపిడీని అమలు చేయడం కోసమే బీసీ యాదవ వర్గానికి చెందిన వైసీపీ మహిళా మేయర్‌ను తొలగించారని, కార్పొరేటర్లను కోట్లతో కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని బుల్డోజ్ చేశారని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ ప్రభుత్వ ఆస్తులు మాయమవుతాయని, వారి కుటుంబ ఆస్తులు మాత్రం పెరుగుతాయని, ఇది ఒక పరిపాటిగా మారిపోయిందని జగన్ విమర్శించారు. చంద్రబాబు, లోకేశ్ తమ పాలనను ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేశారనడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన స్పష్టం చేశారు.

## మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం

వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారం ప్రదర్శించిందని, తాము మాత్రం సఖ్యత కోరుకుంటున్నామని అన్నారు. బడ్జెట్‌లో తమ ప్రతిపాదనలకు కేంద్రం అంగీకరించాల్సిందేనని స్పష్టం చేశారు. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలని అన్నారు.

## వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం

సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26, వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4% కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

## ఇరాన్ బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుడు

రివల్యూషనరీ గార్డ్ నేవీ కమాండర్ లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. స్థానిక మీడియా మాత్రం వాటిని ఖండించింది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో ఈ పేలుడు కలకలం రేపింది. బందర్ అబ్బాస్ నౌకాశ్రయం హర్మూజ్ జలసంధిలో ఉంది. ఇరాన్, ఒమన్‌ల మధ్య ఇది కీలక జలమార్గం. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు ఈ మార్గం ద్వారానే సరఫరా అవుతుంది. గత ఏడాది ఏప్రిల్‌లో కూడా బందర్ అబ్బాస్ సమీపంలోని పోర్టులో భారీ పేలుడు సంభవించిన ఘటనలో వందలాదిమంది గాయపడినట్లు అప్పుడు వార్తలు వచ్చాయి.

## సాంబార్ నీళ్లు .......ఉడకని అన్నం

**– అర్ధాకలి తో కడుపు నింపుకుంటున్న విద్యార్థులు**

**– విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం.**




**సిబెళగల్** మండలంలోని బురాన్ దొడ్డి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం లో అందించే మధ్యాహ్న భోజనం సాంబార్ నీళ్లు ఉడకని అన్నం విద్యార్థులకు వరంగా మారింది. దీనంతటకి ముఖ్య కారణం వంట చేసే ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం అని చెప్పవచ్చు. ఇదేమిటని ప్రశ్నించిన విద్యార్థులపై ఏజెన్సీ నిర్వాహకులు భయపెట్టడం, మీ ఇంట్లో ఇంతకన్నా బాగా భోజనం చేసుకుంటారా అని పిల్లలను బెదిరింపులకు గురి చేయడమే కాక భోజనం సరిగా లేదని ఎవరికైనా చెబితే ఇంతకన్నా నీచంగా వండి పెడతామంటూ విద్యార్థులపై చిందులేస్తున్నారు. దీంతో చేసేదేం లేక విద్యార్థులు అర్ధాకులతో కడుపు నింపుకుంటున్నారు.ఇంత జరుగుతున్న సంబంధిత విద్యాశాఖ అధికారులు బురాన్ దొడ్డి ఉన్నత పాఠశాల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి రుచికరమైన భోజనం అందించే వంట ఏజెన్సీని నియమించాలని విద్యార్థులు మీడియాతో తెలిపారు.

### వనపర్తి పట్టణంలోని 24 వ వార్డు

## ప్రజాసంకల్పం కోసం కృషి చేస్తా

**– ఏర్పుల అరుణ బి.ఆర్.ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి.**

**వనపర్తి** వనపర్తి పట్టణంలో 24 వ వార్డు ప్రజల సమస్యలు పరిష్కారం కోసం మేము నిరంతరం పాటు వారి సమస్యలను, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు ప్రభుత్వం నుంచి రావాల్సినటువంటి పింఛన్లు రుణాలను మంజూరు, చేయించడానికి కృషి చేస్తానని ఇంటి స్థలాలు లేనివారికి డబల్ బెడ్ రూమ్ లేని వారికి తాను కృషి చేస్తానని ,వార్డులో ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ఇంటింటికి వెళ్లి అరుణ కోరుతున్నారు .కాలనీలో ఐమాక్స్ లైట్లు వేయిస్తానని ప్రచారంలో దూసుకుపోతున్నారు .కాలనీలోని వృద్ధులు వితంతువులు వికలాంగుల సమస్యలను తెలుసుకుంటూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకటస్వామి తోట బాలరాజు, ఎండి హుస్సేన్ వి రాజశేఖర్ ,జి రవికుమార్, రాంబాబు ,రాఘవేందర్.మహిళలు అలివేల ,అరుణ జయంతి ,మంజుల, గట్టమ్మ వినయ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కరీంనగర్‌లో ఘనంగా పోలీసు అధికారుల

## పదవీ విరమణ సన్మానం




**కరీంనగర్** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఐదుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారంనాడు కరీంనగర్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమిషనరేటు కార్యాలయం నుండి ఏవో వై.వి. మునిరామయ్య, మహిళా పోలీసు స్టేషన్ నుండి ఎస్సై చల్ల రాజన్న, ట్రాఫిక్ పి.ఎస్. నుండి మహమ్మద్ ముస్తఫా, ఏ.ఆర్. పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుండి, ఏఆర్ ఎస్సైలు ఖలీల్, మహమ్మద్ బాషు పదవీ విరమణ పొందారు.కరీంనగర్ అడిషనల్ డీసీపీ పరిపాలన వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన ఇరువురికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లు వెంకటరమణ , సిఎస్బి ఏసీపీ శ్రీనివాస్ , సిఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రిజర్వు ఇన్స్పెక్టర్ అడ్మిన్ రజినీకాంత్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై శ్రీ మామిడి సురేందర్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## మంజీరా నీరు లీక్‌స్థానికుల ఇబ్బందులు

**హైదరాబాద్** కూకట్ పల్లి జాతీయ రహదారిలో మంజీరా వాల్ లీకై నీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. ఉదయం నుండి నీరు వృథాగా పారుతున్నా జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నగరంలో నీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రోడ్డుపై మంచినీరు వృథాగా పోతోందని మండిపడుతున్నారు. రోడ్డుపై రెండు, మూడు కిలోమీటర్ల మేర నీరు పారడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు ప్రయాణం సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

## రైలు కింద పడి ముగ్గురు ఆత్మహత్య





చర్లపల్లిఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య ఎంఎంఎటీఎస్ డౌన్ లైన్‌లో శనివారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. రైలు కింద పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. శనివారం ఉదయం సుమారు 2.30 గంటల సమయంలో చర్లపల్లి సెక్షన్ పరిధిలోని కిలోమీటర్ నంబర్ 206/48 వద్ద గూడ్స్ రైలు లోకో పైలట్ వాకీటాకీ ద్వారా సమాచారం అందించారు. రైల్వే పట్టాలపై ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఐపీఎఫ్, చర్లపల్లి, ఏఎస్ఐపీఎఫ్ బిఎస్.రావు, జీఆర్పీ సిబ్బంది శ్రీ సాయి ఈశ్వర్ గౌడ్, మాదవ్ (ఎస్ఐ) ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైల్వే పట్టాల మధ్యలో మూడు మృతదేహాలు తీవ్ర గాయాలతో పడి ఉన్నట్లు గుర్తించారు. మృతులను బోడుప్పల్, హరితవనం కాలనీకి చెందిన పిన్నింటి విజయ శాంతి రెడ్డి (38), విజయశాంతి రెడ్డి కుమారుడు విశాల్ రెడ్డి, కూతురు చైతన్య రెడ్డి లుగా గుర్తించారు. గూడ్స్ రైలు లోకో పైలట్ సమాచారం ప్రకారం ఇది ఆత్మహత్య ఘటనగా పోలీసులు భావిస్తున్నారు. మృతుల వద్ద ఎలాంటి రైల్వే ప్రయాణ టికెట్లు లేకపోవడంతో పాటు విలువైన వస్తువులు కూడా లభించలేదని జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం ఆర్పీఎఫ్, జీఆర్పీ సంయుక్తంగా జాయింట్ అబ్జర్వేషన్ రిపోర్ట్ తయారు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జీఆర్పీ సికింద్రాబాద్ క్రైమ్ నంబర్ 57/2026 కింద బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పాయకరావుపేటలో మంత్రి అనిత పర్యటన

**అనకాపల్లి** పాయకరావుపేట పట్టణంలో హోం మంత్రి అనిత, వీఎమార్డీయే చైర్మన్ ప్రణవ్ గోపాల్ పర్యటించారు. వారికి పేట పట్టణ ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగున హారతులతో స్వాగతం పలికారు. శెట్టి బలిజపేటలో పేటలోమంత్రి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసారు.తరువాత పాయకరావుపేట పట్టణంలో గౌతమ్ థియేటర్ కూడలి వద్ద పాయకరావుపేట ప్రధాన రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేసారు.ఎన్నికల సమయంలో పాయకరావుపేట ప్రధాన రహదారి విస్తరణ చేస్తానని మంత్రి అనిత హామీ ఇచ్చారు. పాయకరావుపేట గౌతమ్ థియేటర్ జంక్షన్ నుండి వై జంక్షన్ వరకు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. రూ..5.25 కోట్ల రూపాయల నిధులతో పాయకరావుపేట ప్రధాన రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. మంత్రి అనిత చొరవతో పాయకరావుపేట ప్రధాన రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరు అయ్యాయి.

### శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి

## రూ. 90 లక్షల విలువైన వైద్య పరికరాల విరాళం

శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి ముంబైకు చెందిన అల్కెమ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి మధురిమ సింగ్ రూ. 90 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను విరాళంగా అందించారు. శనివారం ఉదయం ఈ పరికరాలను టిటిడి జేఈవో (ఆరోగ్యం ఌ విద్య) డా. ఎ. శరత్ కు అందజేశారు.దాత అందించిన పరికరాలు1. హై ఎండ్ వెంటిలేటర్లు 42. పేషెంట్ మానిటర్లు 43. హ్యూమిడిఫయర్లు 44. హెచ్ఎఫ్ఎన్‌సీ (హై ఫ్లో నాసల్ కేన్యులా పరికరాలు) 4ఈ సందర్భంగా జేఈవో డా. ఎ. శరత్ మాట్లాడుతూ, చిన్నపిల్లల హృదయ చికిత్సలకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న నూతన చిల్డ్రన్స్ ఆసుపత్రికి అవసరమైన పరికరాలను విరాళంగా అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అల్కెమ్ ఫౌండేషన్ మరింత అభివృద్ధి సాధించాలని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహం లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీమతి మధురిమ సింగ్ ను శాలువాతో సత్కరించి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ భరత్, అల్కెమ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ

**నెల్లూరు** ఒకరోజు ముందుగానే ఏపీలో పెన్షన్ పంపిణీ చేస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు. ఏపీలో ప్రతీనెలా ఒకటో తారీఖున పండగ వస్తుందని తెలిపారు. నెల్లూరులో ఆయన పెన్షన్ పంపిణీలో పాల్గొని.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. నెల్లూరు నగరంలో కాలువలన్నిటినీ ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు.

## అంబటిని అడ్డుకున్న పోలీసులు: టీడీపీ నేతలు

**గుంటూరు** గుంటూరు జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబును టీడీపీ నేతలు, పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రికత్త చోటు చేసుకుంది. తిరుమల లడ్డూ అంశంపై వైసీపీ చేపట్టిన పాప ప్రక్షాళన పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు అంబటి రాంబాబు గోరంట్లకు వెళ్తుండగా.. ఈ ఘటన జరిగింది. సహనం కోల్పోయిన అంబటి రాంబాబు సీఎం చంద్రబాబుపై బూతులతో రెచ్చిపోయారు. కర్రలు, రాడ్లు పట్టుకుని టీడీపీ కార్యకర్తలు తిరుగుతున్నా.. పోలీసులు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు.ద

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే దస్తగిరి** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గులదస్తగిరి అన్నారు. మండల పరిధిలోని బురాన్ దొడ్డి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో శనివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయని ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ఉన్నటువంటి నిరుపేదలకు ప్రభుత్వం వివిధ స్కీముల ద్వారా ఆర్థిక భరోసా కల్పించి గ్రామస్థాయిలో ఉన్నటువంటి నిరుపేదలను లక్ష అధికారులను చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కు గ్రామంలోని టిడిపినాయకులు యువకులు స్త్రీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్హులైన లబ్ధిదారుల ఇంటిదగ్గరకు వెళ్లిఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ ను స్వయంగా ఆయన చేతుల మీదుగా 4000 రూపాయలను అందజేశారు. దీంతో అవ్వ తాతల ముఖాల్లో చిరునవ్వులు , ఆనందనీ వెలు విరిసింది. గ్రామంలోని పురవీధుల గుండా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, ఏవో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, సి బెళగల్ మండల కన్వీనర్ చంద్రశేఖర్ , సింగిల్ విండో అధ్యక్షులు డాక్టర్ చిన్న తిమ్మప్ప, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్ , పేమర భీమన్న,గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఎంపిటిసి సభ్యులు కృష్ణవేణి, గ్రామ నాయకులు రామ్మోహన్ రెడ్డి, ఆయా గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై ముగిసిన స్పీకర్ విచారణ..

**హైదరాబాద్** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్ పై స్పీకర్ విచారణ ముగిసింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీజేపీ పిటిషన్‌పై ఫిబ్రవరి 18న విచారించనున్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేయాలని బీజేపీ కోరింది. ఫిబ్రవరి 8న విచారణకు అవకాశం ఇచ్చారు.

## మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవా

**కోల్ కత్తా,** బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారుప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఏపీలో ఇ-సైకిళ్లపై రూ.10 వేల

# రాయితీ ప్రకటించిన ప్రభుత్వం

**తిరుపతి** ఏపీలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పర్యావరణ హిత ఇ-సైకిళ్లను భారీ రాయితీపై అందిస్తోంది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా కుప్పంలో 24 గంటల వ్యవధిలో 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. పర్యావరణ హితమైన కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రూ.10 వేల సబ్సిడీ.. రూ.25 వేలకే సైకిల్ ఇ-మోటరాడ్స్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, రూ.35,000 విలువైన ఒక్కో ఇ-సైకిల్‌పై ప్రభుత్వం రూ.10,000 రాయితీ కల్పిస్తోంది. దీంతో ప్రజలు కేవలం రూ.25,000 చెల్లించి ఈ సైకిల్‌ను సొంతం చేసుకోవచ్చు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఈ సైకిల్ 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. విశేషమేమిటంటే ఈ సైకిళ్లను కుప్పంలోనే ఇ-మోటరాడ్ సంస్థ అసెంబుల్ చేస్తోంది. గిన్నిస్ రికార్డు అందుకున్న కలెక్టర్ సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తూంసీలోని ప్రజావేదిక వద్దకు ఆయన దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఇ-సైకిల్‌పై ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం గిన్నిస్ రికార్డు సాధించినందుకు గాను చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధృవీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, కుప్పం ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. "ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేశారు, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం" అని పేర్కొన్నారు. ఇ-సైకిళ్లకు పైసా ఖర్చు లేకుండా ఇంట్లోనే ఛార్జింగ్ చేసుకోవచ్చని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. బెగ్గిపల్లె గ్రామంలో ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబుతిరుపతి,జనవరి 31ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండో రోజు పర్యటనలో భాగంగా ప్రజలతో మమేకమయ్యారు. శనివారం ఆయన బెగ్గిపల్లె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే స్వయంగా వెళ్లి, వారిని ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వారి యోగక్షేమాలను విచారించి, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముగ్గురు లబ్ధిదారులకు తన చేతుల మీదుగా పింఛన్లు అందించారు. మునెమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, చిన్నతాయమ్మ అనే మహిళకు వితంతు పింఛను, వెంకటరామప్పకు వృద్ధాప్య పింఛను అందజేసి వారికి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రే నేరుగా తమ ఇంటికి వచ్చి పింఛను అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంలో భాగంగా సీఎం ఈ కార్యక్రమం చేపట్టారు.

## వివాహేతర బంధంతో నిండు ప్రాణం బలి

**నల్గొండ** నల్గొండ జిల్లాలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. చిన్నారిని గాయపరిచింది. వెలుగులోకి వచ్చిన ఈ హత్య కేసు స్థానికంగా సంచలనంగా మారింది. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం కేతపల్లిలో ఈ దారుణం జరిగింది. నగేష్ యాదవ్ అనే వ్యక్తికి సుజాత అనే మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయంలో చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. అయితే ఈ గొడవలకు నగేష్ భార్య కారణమని భావించిన సుజాత ఆమెను చంపేయాలన నిర్ణయించింది. ఆమె ఇంట్లో ఉన్న టైంలో నగేష్ భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించేసింది. ఈ మంటల్లో ఆమె కాలి గాయాలపాలైంది. అక్కడికక్కడే చనిపోయింది. ఆమె పక్కనే ఉన్న ఆరునెలల బాబు కూడా తీవ్రంగా గాయపడ్డాడు.

## స్టాక్ మార్కెట్‌పై బడ్జెట్ ప్రభావం

**ముంబై,**2026 బడ్జెట్ కోసం దేశం ఉత్కంఠభరితంగా ఎదురుచూస్తోంది, ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రిపై ప్రజలు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇంతలో, బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రోజున స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ కోసం తెరిచి ఉంటుందా లేదా అనేది పెట్టుబడిదారులు, ప్రజలలో అనేక అనుమానాలు ఉన్నాయి. ఫిబ్రవరి 1 ఆదివారం నాడు కావడంతో, మార్కెట్ యథావిధిగా తెరిచి ఉంటుందా లేదా మూసివేసి ఉంచుతారా అని చాలా మందికి కచ్చితంగా తెలియదు. అందువల్ల, బడ్జెట్ రోజున స్టాక్ మార్కెట్ తెరిచి ఉంటుందా లేదా అనేది తెలుసుకోవడం ముఖ్యం. బడ్జెట్ దినోత్సవం, ఆదివారం, ఫిబ్రవరి 1, 2026న, స్టాక్ మార్కెట్ యథావిధిగా తెరిచి ఉంటుంది. ఈ రోజున ౠఇ, ఔౠఇ రెండూ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లను నిర్వహిస్తాయి.

సాధారణ వ్యాపార దినాలలో మాదిరిగానే ఈ రోజు కూడా కొనుగోలు, అమ్మకాలు జరుగుతాయి. పెట్టుబడిదారులు ఎటువంటి అంతరాయాలు లేకుండా వ్యాపారం చేయగలరని ఔౠఇ స్పష్టం చేసింది. వార్షిక బడ్జెట్ కేవలం ప్రభుత్వ గణాంకాల సారాంశం మాత్రమే కాదు, భవిష్యత్తులో దేశ ఆర్థిక దిశను కూడా నిర్దేశిస్తుంది. ప్రభుత్వం పన్ను వ్యవస్థను ఎలా ముందుకు తీసుకెళ్లాలని, రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వాటిలో పెట్టుబడి పెట్టాలని ఎలా యోచిస్తుందో ఇది స్పష్టంగా వివరిస్తుంది. భవిష్యత్ విధానాలు, ప్రణాళికలకు ఇది ఆధారం. బడ్జెట్ ప్రకటనల ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కనిపిస్తుంది. ఎక్కువ నిధులు లేదా మద్దతు పొందే రంగాలలోని కంపెనీల షేర్ల ధరలు పెరుగుతాయి. ప్రభుత్వ దృష్టి తక్కువగా ఉన్న రంగాలలోని స్టాక్‌లు ఒత్తిడికి గురి అవుతాయి. పెట్టుబడిదారులు బడ్జెట్ ఆధారంగా తమ వ్యూహాలను కూడా సర్దుబాటు చేసుకుంటారు.

## వీణ లీక్స్ వివాదం

# తీవ్ర కలకలం

తిరుపతి,ఏపీ రాజకీయాల్లో వీణ లీక్స్ వివాదం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అలాగే ఆ ఆరోపణలు చేసిన వీణ ఇద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. వారిద్దరి ఆచూకీ కనిపించకపోయినా, సోషల్ మీడియాలో వీడియోలు, వారి వెర్షన్లు వైరల్ అవుతున్నాయి. శ్రీధర్‌ను వివరణ ఇవ్వాలని జనసేన అధిష్టానం ఆదేశించిన నేపథ్యంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. డీప్ ఫేక్ వీడియోలతో తనను బద్నామ్ చేశారని ఆయన వర్గం వాదిస్తోంది. మరోవైపు, వీణపై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయి. ఒక జర్నలిస్టుపై దాడికి సంబంధించి, అలాగే ఎమ్మెల్యే తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు బ్లాక్ మెయిలింగ్ ఆరోపణలపై రైల్వే కోడూరు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# ఆసియా తొలి మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా

## - నేడు ఆమె వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )




అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మరియు ఇండో-అమెరికన్ మహిళ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన కల్పనా చావ్లా కొలంబియా స్పేస్ షటిల్ ప్రమాదంలో మరణించి నేటికి సరిగ్గా 23ఏళ్లు. 2003 ఫిబ్రవరి 1 న అంతరిక్షం నుంచి తిరిగివస్తూ కొలంబియా నౌక ప్రమాదానికి గురికావడంతో అమెతోపాటు మరో ఆరుగురు వ్యోమగాములు ప్రాణాలు కోల్పోయారు. కల్పనా చావ్లా 1962 మార్చి 17 న హరియాణాలోని కర్నాల్‌లో ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. లింగవివక్షతను అధిగమించి తల్లి సహకారంతో ఆమె తన కలలను సాకారం చేసుకున్నారు. కల్పన అంటే ఆలోచన లేదా ఊహ. చిన్ననాటి నుంచే ఆకాశంలో విహరించాలనే కోరికతో కల్పన తన పేరును సార్థకం చేసుకున్నారు. పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసిన కల్పనా చావ్లా ఎంఎస్ కోసం 1980లో అమెరికా వెళ్లారు. టెక్సాస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత, 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్ పట్టాను స్వీకరించారు. అదే ఏడాది నాసా పరిశోధన కేంద్రంలో చేరిన కల్పన పవర్ లిఫ్ట్ కాంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ విభాగంలో వైస్-ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత నాసాకు వైస్-ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. తొలిసారిగా 1997లో కొలంబియా నౌక ద్వారా అంతరిక్షయానం చేసిన కల్పనా చావ్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలో 376 గంటలు గడిపి భూమిచుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మైళ్లు తిరిగారు. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగానే కాదు, తొలి ఆసియా మహిళగానూ కల్పన రికార్డులకెక్కారు. 2003 జనవరిలో రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లి 16 రోజులు గడిపి 80 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించారు. ఆ తర్వాత యాత్ర ముగించుకుని వస్తుండగా 2003 ఫిబ్రవరి 1 న కొలంబియా వ్యోమనౌక కూలిపోవడంతో ఆమెతోపాటు మరో ఆరుగురు వ్యోమగాములు దుర్మరణం పాలయ్యారు. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ జీన్ పియరీ హ్యారీసన్‌ను 1983లో కల్పన వివాహం చేసుకున్నారు. ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కారాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోంది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అందజేస్తుంది. భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు.

## వైకాపా నేతల ప్రత్యేక పూజలు

**నరసాపురం** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం రాజగోపాల స్వామి ఆలయంలో వైఎస్ఆర్ సీపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరావు ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, జడ్పిటిసిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ తిరుపతి లడ్డు ప్రసాదంలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని సిట్ నివేదిక ఇచ్చిందని. ముదునూరి ప్రసాదరాజు అన్నారు. రాజకీయాలకు భగవంతుణ్ణి వాడుకోవడం మంచిది కాదని. రాజకీయంగా జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కోవాలి కానీ భగవంతుని రాజకీయాలకు వాడుకోవద్దని. తిరుపతి లడ్డు ప్రసాదములో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ఆరోపణ చేసిన కూటమి నాయకులకు పశ్చాతాపం కలగాలని అన్నారు ఎమ్మెల్సీ వంకా రవీంద్ర మాట్లాడుతూ రాజకీయాల కోసం వెంకటేశ్వర స్వామిని వాడుకోవడం సరికాదని. కు?టమినేతలు మతాల మధ్య కులాల మధ్య గొడవలు పెట్టి రాజకీయం చేయడం సరికాదని. ఇప్పటికైనా కూటమి నేతలు రాజకీయాలు మాని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయి విద్య వైద్యం పై దృష్టి సారించండి మతకలహాలు సృష్టించకండని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చాగంటి సత్యనారాయణ. దొంగ మురళీ తదుతర నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై

# కేసు నమోదు చేయాలి

**జగ్గయ్యపేట** జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తిరుపతి లడ్డు కల్తీ అంటూ విష ప్రచారం అంటూ పరిహార పూజలు నిర్వహించారు. తన్నీరు మాట్లాడుతూ హిందువుల నుండి వైసీపీ పార్టీని ,జగన్మోహన్ రెడ్డిని దూరం చేయటానికి బిజెపి, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు పన్నిన కుట్ర. తిరుమల లడ్డు పవిత్రతను కాపాడాలని అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి వారికి క్షమాపణ చెప్పాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని కూటమి ప్రభుత్వం ప్రజల లో వ్యతిరేకత రావడంతో లడ్డులో కల్తీ అంటూ విష ప్రచారం. తిరుపతి లడ్డు పై అసత్య ప్రసారాలు చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ పై కేసులు నమోదు చేయాలని అన్నారు.


## తాడేపల్లిగూడెంలో

# వైకాపా నిరసన

**తాడేపల్లిగూడెం...**చంద్రబాబు, పవన్ కళ్యాణ్ శ్రీవారి లడ్డుపై చేసిన దుష్ప్రచారానికి పరిహారంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిరసనగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆలయంలో కొబ్బరికాయలు కొట్టిన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కలియుగ వెంకటేశ్వర స్వామి భక్తులకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలన్నారు. నోటికొచ్చినట్లుగా లడ్డులో పంది కొవ్వు కలిసిందని హిందువులు మనోభావాలు దెబ్బతినే విధంగా ఈ కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అని మాట్లాడుతున్నారో సుప్రీం కోర్టు, సీబీఐ, సిట్ లడ్డులో ఏ కల్తీ లేదని రిపోర్ట్ ఇచ్చారో దానికి సమాధానం చెప్పాలన్నారు. మైలు అయిందంటూ గుడి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పి మళ్ళీ రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాల మెట్లు కడగాలన్నారు. విష ప్రచారం చేసిన ఈ కూటమి నాయకుల భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఆ భగవంతుడు చూస్తాడన్నారు.

ప్రపంచం వ్యాప్తంగా ఉన్న హిందువులు మనోభావాలు దెబ్బతీసే విధంగా ఈ కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. లడ్డులో ఎంత పవిత్రత ఉందో ఈరోజు తేటతెల్లం అయిందన్నారు. పాపం జరిగిందని ప్రజల్ని నమ్మించేందుకు ఆరోజు పవన్ కళ్యాణ్ దేవాలయం మెట్లు క్రింద నుండి పైకి కడిగారని, ఈరోజు అది అబద్ధం అని తేలింది కాబట్టి పైనుండి క్రిందకి పవన్ కళ్యాణ్ తిరుమల మెట్లు కడగాలన్నారు. జగన్మోహన్ రెడ్డి మీద వేసిన బురదని ఆ వెంకటేశ్వర స్వామి వారే కడిగేసారన్నారు. కూటమి నాయకులు చేసిన పాపానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

## హిమచల్‌ప్రదేశ్‌లో దెబ్బతిన్న రవాణా వ్యవస్థ



అరుణాచల్‌ప్రదేశ్: వర్షకాలంలో భారీ వానాలతో పోటెత్తిన వరదలతో అతలాకుతలమైన హిమచల్‌ప్రదేశ్.. మరోసారి మంచు తుపాన్‌తో కుదేలైపోయింది. పలు రోజుల నుంచి కురుస్తున్న భారీ మంచు తుపాన్‌తో ఆ రాష్ట్రానికి పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది. ఆ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు రోడ్లపై మంచుపడి ధ్వంసమైయ్యాయి. దీంతో వివిధ ప్రాంతాలకు రాకపోకలు దెబ్బతిన్నాయి. సాధారణ జనజీవనం స్తంభిపోయింది. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదురుకున్నారు. పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులు మంచు ధాటికి ధ్వంసమైయ్యాయి. గడిచిన 24 గంటల్లో ఆ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులతో కలుపుకొని 482 రోడ్లు మూతబడ్డాయని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ూఇూఅ) పేర్కొంది. 62 వాటర్ సప్లయ్ కేంద్రాలపై మంచు తుపాన్ తీవ్రంగా ప్రభావితం చేసిందని వెల్లడించింది. చంబా అనే జిల్లా మంచు తుపాన్ తో అధికంగా దెబ్బతిందని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మంచు తుపాన్‌తో దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టామని ూఇూఅ పేర్కొంది. ప్రాధాన్యత క్రమంగా ఆయా రంగాల్లో పునరుద్ధరణ పనులను కొసాగిస్తున్నామని చెప్పింది.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందించిన

# కూటమి కార్యకర్తలు



**ఎమ్మిగనూరు** శనివారం పట్టణ ఎస్సీ కాలనీ నందు ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందిస్తున్న పెన్షన్లు ఒకటే నెలలో రెండు పెన్షన్లు అందుకున్న పెన్షన్ దారులు సీఎం చంద్రబాబు నాయుడు గారికి మరియు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి మరియు కూటమి ప్రభుత్వానికిని కృతజ్ఞతలు థాంక్స్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జ్ అంబేద్కర్ తెలుగుదేశం పార్టీ కోపరేట్ టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరికోట షాలేము మరియు సూరి బూత్ కన్వీనర్లు శ్రీనివాసులు వెంకటేశు వీరేష, తదితరులు పాల్గొన్నారు

# కక్షతో నోటీసులు ఇస్తున్నారు

**హైదరాబాద్** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎక్కడ ఉంటాడో తెలిసి కూడా కావాలనే నంది నగర్ నివాసం బైట నోటీసులు అంటించారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరో?పించారు. 65 ఏళ్లు దాటిన వారిని వాళ్లు ఉంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధన తెలిసి కూడా కావాలనే కక్షతో అలా చేశారుని అయన మండిపడ్డారు.

## డిజైన్ ఫర్ డిజైర్.. ఫ్యాషన్ లవర్స్‌ని

# ఆకట్టుకుంటున్న కలెక్షన్

ఫ్యాషన్ ఔత్సాహికులను ఆకట్టుకునే కలెక్షన్తో నగరంలో డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణా హోటల్లో ఈ ప్రదర్శన ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ లో పలువురు మోడల్స్ పాల్గొని ఆభరణాలను ధరించి సందడి చేశారు. ఫ్యాషన్ లవర్స్ ఎంతో ఇష్టపడే డిజైనరీ కలెక్షన్తో పాటు డిజైనరీ నగలు, వస్తువులు అందుబాటులో ఉంచుతున్నట్లు నిర్వాహ కురాలు అనితా అగర్వాల్ తెలిపారు. ప్రత్యేకంగా ఆర్టిస్టిక్ వస్తువులు, వెడ్డింగ్ స్పెషల్ కలెక్షన్, స్టైలిష్ వస్తువులు లభిస్తాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన డిజైనర్లు రూపొందించిన వస్తువులు ఇందులో ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు.

## మైసౌత్‌దివా 9వ ఎడిషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

దక్షిణ భారతదేశంలోని ప్రముఖ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు లైఫ్‌స్టైల్ ప్లాట్‌ఫామ్ మైసౌత్‌దివా తన 9వ ఎడిషన్ క్యాలెండర్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరించింది. ఈ క్యాలెండర్‌లో శ్రియా శరన్, కేథరిన్ థెరిస్సా, కాజల్ అగర్వాల్, మాళవికా శర్మ, తాన్య హోప్, ఐశ్వర్య కృష్ణ, కుషిత కొల్లాపు, వినాలీ భట్నాగర్, రియా సచ్ దేవ్, కనిక మాన్, పాలక్ అగర్వాల్ భాగమయ్యారు. ఈ సందర్భంగా మైసౌత్‌దివా ఫౌండర్ మనోజ్ కుమార్ కటోకర్ మాట్లాడుతూ, తొమ్మిదేళ్లుగా ఈ క్యాలెండర్‌ను తీసుకొస్తున్నామని, 12 మంది కథానాయికలతో కూడిన ఈ క్యాలెండర్ అందరికి నచ్చుతుందనుకుంటున్నానని చెప్పారు. ఈ క్యాలెండర్ ద్వారా కొత్తవారిని మోడల్స్‌గా పరిచయం

## హైదారాబాద్‌లో ఫ్యూజీ ఫిల్మ్ కొత్త ప్రొడక్టులు

ఫ్యూజీ ఫిల్మ్ ఇండియా.. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఐఆర్ఎఏ సదస్సులో సరికొత్త డయాగ్నస్టిక్ ఇమేజింగ్ సొల్యూషన్స్ను ఆవిష్కరించింది. వీటిలో ఎఫ్సిటీ ఐస్ట్రీమ్ సీటీ ప్లాట్ఫారమ్, సోఫినిటీ డిజిటల్ మామోగ్రఫీ ఎఫ్ఆర్, స్మార్ట్ ఎక్స్ ఎసెన్షియల్ ఎక్స్రే సిస్టమ్స్ ఉన్నాయి. హెల్త్కేర్, ఐటీ రంగాల కోసం ఫెనిక్స్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ను కూడా పరిచయం చేసింది. పెరుగుతున్న రోగుల రద్దీని తట్టుకోవడానికి రేడియాలజీ విభాగాలకు ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపింది. ఏఐ ఆధారిత పనితీరు వల్ల రోగులకు తక్కువ రేడియేషన్ తోనే ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని ఫ్యూజీ ఫిల్మ్ పేర్కొంది.

## హైదర్ నగర్‌లో

# కాంగ్రెస్ నిరసన

**రంగారెడ్డి** శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి టీపీసిసి లేబర్ సెల్ ప్రెసిడెంట్ నల్ల సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరు తొలగించినందుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. దేశ ప్రధాని మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు కాంగ్రెస్ నేతలు. మహాత్మా గాంధీ పేరును తీసేసిన మన దేశ ప్రజల గుండెలో ఉంటారు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు అమలు చేయడం తో పాటు లేబర్ విధానాలు మార్చడం వారి నియంత పోకడకు నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక కార్మిక కోడ్ ను వెనక్కి తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ, కార్మిక సంఘాలతో కలిసి తమ నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు.

## సమానత్వం, ప్రేమ భావనలను చాటుతున్న గురు రవిదాస్ బోధనలు

ప్రతి ఏట మాఘ పూర్ణిమ రోజు "గురు రవిదాస్ జయంతి"ని భారతదేశవ్యాప్తంగా అత్యంత గౌరవప్రదంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. అతి ప్రధానమైన భారత సాధువుల్లో ఒకరైన గురు రవిదాస్ భక్తి ఉద్యమాలు, ఆధ్యాత్మిక బోధనలు, కరుణతో నిండిన జీవితం, వివక్షలేని సమాజం, సామాజిక సమానత్వ పోరాటాలు, కుల వ్యవస్థను సవాలు చేయడం లాంటి అంశాలు నేటి పౌర సమాజంపై చెరగని ముద్రను వేసాయి. దేవుడి ఏకత్వ బోధనలు, ఆధ్యాత్మిక స్వచ్ఛత ప్రోత్సాహాలు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి, భవిష్యత్తులో కాలాతీత సందేశాలుగా ఉంటాయి కూడా. గురు రవిదాస్ జీవనయానం వినయం, భక్తి, కరళత అనే ఇతివృత్తాలతో ముడిపడి ఉన్నది. 15వ శతాబ్దంలో తక్కువ కుల (తోలు కార్మిక) కుటుంబంలో జన్మించిన గురు రవిదాస్, సాధువుగా మారి సమానత్వం సాధనకు కృషి చేసిన ఆధ్యాత్మిక నాయకుడుగా మనకు తెలుసు. పుట్టుక, కులం, మతం పేర్లతో పౌర సమాజ విభజనలు వ్యతిరేకించిన రవిదాస్ కుటుంబం చెప్పులు కుట్టే పనిలో గడిపేవారు. ఆయన బోధనలు విన్న పండితులు, రారాజులు సహితం ఆయనకు ఎనలేని గౌరవాన్ని ఇచ్చేవారు. గురు రవిదాస్ తన భక్తి గీతాలతో ప్రసిద్ధి పొందారు. అనేకమైన ఈ గీతాలు సిక్కుల మత గ్రంథమైన "గురు గ్రంథ్ సాహిబ్"లో చేర్చబడ్డాయి. ఆయన కీర్తనలు మతపరమైన సరిహద్దులను దాటి సమానత్వ సాధనకు ఉపకరించాయి. ప్రేమ, ఐక్యత, సమానత్వం అనబడే సందేశాలు నేటికీ లక్షలాది ప్రజలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. సకల జీవుల్లో దేవుడు ఉన్నాడని, దైవం ముందు పెద్ద చిన్న కులాలు లేవని ప్రచారం చేసాడు. గురు రవిదాస్ బోధనలు అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన జీవితంపై ఆశలు, బలాన్ని అందించాయి. బాహ్య ఆచారాల కంటే భక్తి ఆధారంగా దైవంతో సంబంధం పెట్టుకోవచ్చని వివరించాడు. విగ్రహారాధనను వ్యకిరేకిస్తూ, నిరాకార దేవుని ఏకత్వ భావనను ప్రచారం చేసాడు. గురు రవిదాస్ జయంతి రోజు ఆధ్యాత్మిక చింతన, ఆనంద పూజలు, సమాజ వేడుకలు, నాగర్ కీర్తనలు (ఊరేగింపులు), స్తోత్రాల పఠనం, లంగర్ భోజనాలు, దాతృత్వ కార్యక్రమాలు లాంటివని పెద్ద ఎత్తున జరుపుకుంటారు. "మీ హృదయం స్వచ్ఛంగా ఉంటే, ఒక చిన్న కుండ నీరు కూడా పవిత్ర గంగా నదిలా పవిత్రం అవుతుంది" అనే ఒక ప్రసిద్ధ సామెతను గురు రవిదాస్ అందించాడు. అంతర్గత స్వచ్ఛతే ఆధ్యాత్మికత, శాంతికి అదే నిజమైన మార్గం అని నొక్కి వక్కానించిన గురువు మన రవిదాస్. కులమతాలు, సామాజిక వివక్షలకు అతీతంగా ప్రతి ఒక్కరిలో దైవంతో అనుసంధానమయ్యే సామర్థ్యం ఉంటుందని బోధించాడు. గురు రవిదాస్ బోధనలు నేటికీ సందర్భోచితంగా ఉంటూ, అసమానతలు, వివక్షత, సామాజిక అన్యాయాలు వంటి సమస్యలను పరిష్కరించడానికి ఒక నైతిక చట్రంగా నిలుస్తున్నాయి. సమాజ ఐక్యత, కరుణ వ్యాప్తి, నిస్వార్థ సేవాగుణాలను ఆచరిస్తూ గురు రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం.

## పాకిస్తాన్‌లో 52 మంది ఉగ్రవాదులు హతం

పాకిస్తాన్ భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్స్‌లో 52 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. గడచిన 24 గంటల్లో మూడు ప్రావిన్స్‌లలో పాకిస్తాన్ భద్రతా దళాలు ఆపరేషన్స్ నిర్వహించాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులు మృతి చెందారు. గురువారం బలూచిస్తాన్‌లో జరిగిన రెండు వేర్వేరు నిఘా ఆధారిత ఆపరేషన్ల (ఐబిఓలు)లో 41 మంది మృతి చెందారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఒక కమాండర్‌తో సహా ఐదుగురు తెహ్రీక్ ఇ-తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి) బృందానికి చెందిన వ్యక్తులు మృతి చెందారు. లాహోర్ నుండి దాదాపు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రావిన్స్‌లోని మియాన్‌వాలి జిల్లాలో పోలీసులు, ఇతర అధికారుల కార్యాలయాలయాలపై ఉగ్రవాదులు దాడికి సిద్ధమైనట్లు పోలీసుల ఉగ్రవాద నిరోధక విభాగం తెలిపింది. అలాగే ఛాప్రి డ్యామ్ ప్రాంతంలో ఉగ్రవాద నిరోధక బృందానికి, ఉగ్రవాదులకు జరిపిన ఎదురుకాల్పుల్లో మరో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల్ని హతమార్చడానికి పోలీసులు, సైనిక భద్రతా దళాలు ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి.

## అమెరికాలో మళ్లీ షట్ డౌన్ ..!

అమెరికా ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నట్లు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించడంలో కాంగ్రెస్ విఫలం కావడంతో ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ లోకి వెళ్లిపోయింది. 2026 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఆమోదించడానికి అర్ధరాత్రి వరకూ గడువు ఉన్నా.. ఆ లోపు దాన్ని కాంగ్రెస్ ఆమోదించలేకపోయింది. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువును కాంగ్రెస్ దాటవేయడంతో ప్రభుత్వం ఈరోజు పాక్షికంగా షట్ డౌన్ అయింది. దీంతో పలు సేవలు నిలిచిపోబోతున్నాయి. షట్‌డౌన్ స్వల్పకాలికంగా ఉండవచ్చని సెనేటర్లు చెబుతున్నారు. మరోవైపు గడువుకు ముందు బడ్జెట్ పై ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో, తాత్కాలిక లేదా పూర్తి-సంవత్సర నిధుల చర్యను కాంగ్రెస్ ఆమోదించే వరకు కీలకం కాని పలు ప్రభుత్వ కార్యకలాపాల్ని నిలిపేస్తున్నారు. సభ తిరిగి సమావేశం అయ్యాక సెనేట్ మద్దతు ఉన్న ఒప్పందాన్ని ఆమోదించడానికి తగినంత మద్దతును కూడగట్టడానికి చట్టసభ సభ్యులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ?. అమెరికాలో దాదాపు మూడో వంతు ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, రక్షణను నిర్వహించే అనేక ఏజెన్సీలలో షట్‌డౌన్ చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విభాగాలు రాత్రికి రాత్రే షట్‌డౌన్ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించాలని భావించాయి. కానీ ఇది తాత్కాలికమేనన్న అంచనాలతో ఆ ప్రతిపాదన విరమించుకున్నాయి. వచ్చే వారం ప్రారంభంలో కాంగ్రెస్ ఊహించిన విధంగా ప్యాకేజీని ఆమోదిస్తే, కొన్ని రోజుల్లో నిధుల పునరుద్ధరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. షట్‌డౌన్ కొనసాగితే మాత్రం పదివేల మంది ప్రభుత్వ కార్మికులు జీతం లేని సెలవును ఎదుర్కోవలసి రావచ్చు, లేదా నిధులు అందేవరకు జీతం లేకుండా పని చేయాల్సి రావచ్చు.

## క్యూబాకు చమురు ఇస్తే టారిఫ్‌లు !



క్యూబాకు చమురును విక్రయించే లేదా అందించే దేశాల నుండి వచ్చే ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇప్పటికే తీవ్రమైన ఇంధన సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న క్యూబాను ఈ చర్య మరింత ఇబ్బందుల్లోకి నెడుతుంది. ఈ ఆదేశాలు ప్రాథమికంగా మెక్సికోపై ఒత్తిడిని పెంచుతాయి. ప్రస్తుతం క్యూబాకు చమురు జీవనాడిగా మెక్సికో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అలాగే క్యూబాకు నిరంతరంగా సంఘీభావాన్ని కూడా ప్రదర్శిస్తూ వస్తోంది. క్యూబాను ఉక్కిరి బిక్కిరి చేయడానికి ప్రయత్నిస్తున్నారా అని ఒక విలేకరి ట్రంప్‌ను ప్రశ్నించగా, అది చాలా కఠినమైన పదమని వ్యాఖ్యానించారు. 'నేను అలా ప్రయత్నించడం లేదు, కానీ మనుగడ సాగించేలా అది కనిపించడం లేదు.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా ట్రంప్ ఉత్తర్వులను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా ఖండించారు. క్యూబాపై, క్యూబన్లపై తీవ్రమైన దురాక్రమణ చర్య అని వ్యాఖ్యానించారు. క్యూబాకు సంఘీభావంగా నిలిచే దేశాలను బ్లాక్‌మెయిల్ చేసే చర్యలకు ట్రంప్ పాల్పడుతున్నారని విమర్శించారు. గురువారం ఉదయం మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షబ్నంతో ట్రంప్ ఫోన్లో మాట్లాడారు. కాగా తాము క్యూబాపై చర్చలు జరపలేదని ఆమె చెప్పారు.

## గాజాలో సిబ్బందిని తొలగించిన యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ

ఆర్థిక సంక్షోభంతో 'ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)' గాజాలో పలువురు ఉద్యోగులను తొలగించింది. 2026 బడ్జెట్‌లో 220మిలియన్ డాలర్ల లోటు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. దీంతో గాజాలోని స్థానిక సిబ్బందికి ఈ నెల 20శాతం వేతనంలో కోత విధించనున్నట్లు ప్రకటించింది. పనిగంటలను తగ్గించడంతో పాటు ఈ ప్రాంతం వెలుపల ఉన్న ఉద్యోగుల కోసం ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. ఆర్థికలోటు తమ సిబ్బందికి చెల్లింపుల నుండి ప్రతికూల పరిస్థితుల్లో శరణార్థులకు మానవసేవలను కొనసాగించడం వరకు సంస్థ కీలకమైన ప్రాథమిక బాధ్యతలను నెరవేర్చడంలో తమ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని సిబ్బందికి రాసిన లేఖలో కమిషనర్ జనరల్ ఫిలిప్పె లాజారిని పేర్కొన్నారు. తమ సిబ్బందిపై ఇజ్రాయిల్ ఆరోపణల తర్వాత పలు దేశాలు సంస్థకు నిధులను స్తంభింపచేశాయని, అంతర్జాతీయ సాయంలో భారీగా కోత విధించడంతో ఆర్థిక లోటు ఏర్పడిందని తెలిపారు. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ పాలస్తీనా శరణార్థులకు అత్యవసర సేవలను అందిస్తుంది. 70శాతం జనాభాకు విద్య, ఆరోగ్య భద్రత, సామాజిక సాయం అందించడంతో పాటు ఇజ్రాయిల్ దాడులు, సరిహద్దు ఆంక్షలు వంటి కీలక సమయాల్లో స్థిరీకరణ శక్తిగా కూడా పనిచేస్తుంది.

## అప్పులు అడగటం సిగ్గుగా అనిపించింది: పాక్ ప్రధాని వ్యాఖ్యలు

పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీనినుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫే అంగీకరించారు. అప్పులు అడగటం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు.ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ (ంబతిఎ ఓబీనితితీ)తో కలిసి నేను రహస్యంగా చాలా దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాము. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్ద దెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండు చేసినా సరే.. అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు. అయితే రుణాలు ఇచ్చే విషయంలో చాలా దేశాలు తమను నిరాశ పరచలేదన్నారు. పరిస్థితులతో సంబంధం లేకుండా పాక్‌కు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, చైనా వంటి మిత్ర దేశాలన్నింటికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోవడంపై షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. పాక్‌కు ఆర్థికసాయం అందించిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉంది.

## ఒక్కసారిగా కుప్పకూలిన గని.. 200 మంది మృతి!



తూర్పు కాంగో రుబాయా ప్రాంతంలోని ఓ అనీశ్రీబిజీని మైన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. గని ఒక్కసారిగా కూలిపోవడంతో 200 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌లో వాడే ఈ లోహం కోసం అక్కడ మైనింగ్ జరుగుతోంది. రెబల్స్ కంట్రోల్‌లో ఉన్న ఈ గనుల్లో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఘటనలో ప్రాణనష్టం ఎక్కువగా ఉండటం అందరినీ కలచివేస్తోంది.గని కూలిన సమయంలో అక్కడ కార్మికులు, పిల్లలు, మహిళలు మట్టిలో కూరుకుపోయారు. కొంతమంది గాయాలతో బయటపడగా వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా నేల బలహీనపడి, గని ఒక్కసారిగా కుప్పకూలిందని అధికారులు చెబుతున్నారు. కోల్టన్ వంటి ఖనిజాల కోసం ఇల్లీగల్ గా జరిపే తవ్వకాలు ఈ ప్రమాదానికి కారణం అంటున్నారు. ఉత్తర కిపు ప్రాంతంలోని రుబయా నగరం కోల్టన్ ఉత్పత్తికి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

## గ్రామీణ ఉపాధి హామీకి మద్దతుగా

అండమాన్ నికోబార్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)కి మద్దతుగా అండమాన్ నికోబార్ దీవుల్లో సిపిఎం ఇంటింటి ప్రచారం శు క్రవారం ప్రారంభమయింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకాన్ని నీరుగార్చడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న చర్యలకు వ్యతిరేకంగా గాంధీ వర్ధంతి నుంచి వారం రోజుల పాటు ప్రచారం నిర్వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఇది ప్రారంభమయింది. ఈ ప్రచారంలో భాగంగా కేంద్రపాలిత ప్రాంతంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పనుల్లో పాల్గొంటున్న జాబ్-కార్డు హోల్డర్లు, వ్యవసాయ కార్మికుల ఇళ్లను సిపిఎం నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. రాష్ట్ర కార్యదర్శి డి. అయ్యప్పన్, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు గౌరంగ మాఝి, దక్షిణ అండమాన్ గ్రామీణ ప్రాంత కమిటీ సభ్యులు ఎస్ చిదంబరం తదితర నాయకులతో కూడిన బృందాలు ఈ సందర్శనలో పాల్గొన్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఈ పథకాన్ని ఎలా నీరుగారుస్తోందో వివరించాయి. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను రద్దు చేసి, దాని స్థానంలో విబిజిఆర్‌ఎఎంజిని తీసుకుని రావడం ద్వారా గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని సిపిఎం నాయకులు వివరించచారు. మధ్య అండమాన్‌లో జరిగిన ప్రచారానికి సిపిఎం రాష్ట్ర సెక్రటరియట్ సభ్యులు ప్రోజిత్ కుమార్ సర్కార్, పికె ఖలిద్ నేతృత్వం వహించారు. ఉర్మిళాపూర్, బకుల్తల గ్రామ పంచాయితీ ప్రాంతాల్లో ప్రోజిత్ కుమార్ సర్కార్, ఇతర నాయకులు ప్రచారం నిర్వహించగా, శివపురం గ్రామ పంచాయితీ ప్రాంతంలో పికె ఖలీద్, ఇతర నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఫిబ్రవరి 5 వరకూ ఈ ఇంటింటి ప్రచారం జరగనుందని సిపిఎం నాయకులు తెలిపారు.

## అస్సాం సిఎం బిశ్వశర్మపై ఫిర్యాదు



న్యూఢిల్లీ : బెంగాలీ ముస్లింలను ఉద్దేశిస్తూ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వివాదాస్పద 'మియా ముస్లిం' వ్యాఖ్యపై తీవ్ర దుమారం రేగుతోంది. ఆయనపై రచయిత హర్ష్ మందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 196, 197, 299, 302, 353 సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహితలోని నిబంధనల కింద బిశ్వశర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. రాష్ట్రంలో సర్ ప్రక్రియ కొనసాగుతున్నందున భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయకుండా ముఖ్యమంత్రిని నిరోధించాలని, ఆయన చేసిన విద్వేషపూరిత, వివక్షాపూరిత వ్యాఖ్యలపై దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని హౌజ్ కాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని మందర్ ఓ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. తిన్‌సుకియా జిల్లా దిగ్బరులో మంగళవారం జరిగిన అధికారిక కార్యక్రమంలో బిశ్వశర్మ మాట్లాడుతూ బెంగాలీ ముస్లింలను 'మియా'లుగా అభివర్ణించారు. వారిపై వేధింపులు, వివక్షను ప్రోత్సహించేలా ప్రకటనలు చేశారు. ఓటర్ల జాబితా నుంచి ముస్లింల పేర్లను తొలగించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా ముస్లింలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేయాలని, అభ్యంతరాలు తెలపాలని బిజెపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మియాలు ఇబ్బంది పడేలా చూడడమే తన పని అని చెప్పారు. వారిని ఇబ్బంది పెడుతుంటే అస్సాంను వదిలేసి వెళ్లిపోతారని అన్నారు. గతంలో కూడా బిశ్వశర్మ అనేక వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే



న్యూఢిల్లీ: చదువుకునే అవకాశం అందరికీ కల్పించే విద్యాహక్కు, లింగసమానత్వ హక్కు, జీవన హక్కు కోవలోనే... మహిళలు, బాలికలకు నెలసరి శుభ్రత కూడా ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, పాఠశాలలకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం శుక్రవారం పలు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు పర్యావరణహితమైన రుతు రుమాళ్లు (శానిటరీ న్యాప్కిన్స్)ను ఉచితంగా అందించాలని తెలిపింది. అందరికీ కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని, శుభ్రమైన టాయిలెట్లను బాలికలకు, బాలురకు, దివ్యాంగులకు విడివిడిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేస్తూ 126 పేజీల తీర్పు వెలువరించింది. 'ఈ తీర్పు న్యాయవ్యవస్థలో భాగమైన వారి కోసం మాత్రమే కాదు. సహాయం అడిగేందుకు సంకోచించే విద్యార్థినులు, నిధుల కొరత కారణంగా సహాయం చేయలేని స్థితిలో ఉన్న ఉపాధ్యాయుల కోసం కూడా' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేసింది. బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయకపోతే ప్రైవేటు పాఠశాలలు గుర్తింపు కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది రాజ్యాంగంలోని అధికరణం 21 కిందకు వచ్చే జీవన హక్కులో భాగమని వ్యాఖ్యానించింది. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, గౌరవం దెబ్బతింటాయని, ఇది సమానత్వ హక్కుకు కూడా విరుద్ధమని న్యాయస్థానం అభిప్రాయపడింది. టాయిలెట్లను ఏర్పాటు చేయడంలో, రుతురుమాళ్లను ఉచితగా అందించడంలో రాష్ట్రాలు విఫలమైతే వాటినీ జవాబుదారులుగా నిలబెడతామని స్పష్టం చేసింది.

## నేను భాజపాకు అనుకూలం కాదు: థరూర్



తిరువనంతపురం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిజాయతీ గల నాయకుడని, దేశంలో నెలకొన్న మతతత్వం వంటి పలు అంశాలపై ఆయనది బలమైన స్వరమని తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ ప్రశంసలు కురిపించారు. దేశంలోని మతతత్వం, ద్వేషం, విభజన రాజకీయాలపై నిరంతరం మాట్లాడే రాహుల్‌ను అందరూ ఇష్టపడతారని.. ఇందులో తనకు భిన్నాభిప్రాయం ఏమీ లేదన్నారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌పై వచ్చిన తప్పుడు వ్యాఖ్యలతో తాను ఏన్నడూ ఏకీభవించలేదని స్పష్టం చేశారు. పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీలతో దిల్లీలో సమావేశమై తన ఫిర్యాదులు పరిష్కరించుకున్న అనంతరం శశి థరూర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కొన్ని అంశాలపై తన వైఖరిని భాజపాకు అనుకూలంగా ఉందని మీడియా ప్రచారం చేసిందని.. తాను మటుకు ఆయా అంశాలను ప్రభుత్వానికి, భారత్‌కు అనుకూలంగా ఉన్నట్టు భావిస్తానని శశి థరూర్ వివరణ ఇచ్చారు. పార్లమెంటులో తాను ఎప్పుడూ పార్టీతోనే నిలబడ్డానని, ఇందులో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడనని స్పష్టంగా చెప్పగలరా? అని మీడియా ప్రశ్నించగా.. "నేను కాంగ్రెస్‌లోనే ఉంటానని, ఎక్కడికీ వెళ్లనని చెప్పగలను. కేరళ ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొని యూడీఎఫ్ విజయానికి కృషి చేస్తా" అన్నారు.

## శ్మశానవాటిక దారి మూసివేత నడిరోడ్డుపై అంత్యక్రియలు

వైశాలి: బీహార్‌లోని వైశాలి జిల్లాలో ఓ వృద్ధురాలి మృతదేహానికి నడిరోడ్డుపై అంత్యక్రియలు చేశారు. గోరౌల్ ఠాణా పరిధిలోని సోంధో వసుదేవ్ గ్రామానికి చెందిన ఝూన్సీదేవి (91) చనిపోయారు. గ్రామస్థులు ఆమె మృతదేహాన్ని తీసుకువెళుతుండగా శ్మశానవాటికకు వెళ్లే దారిలో ఉన్న పొలాల యజమానులు అడ్డుకున్నారు. శ్మశానవాటికకు ఉన్నది అదొక్కటే దారి కాగా, ఆక్రమణలతో మూసివేశారు. దీంతో గ్రామస్థులు శివాలయం ముందున్న రోడ్డుపైనే చితిని పేర్చి, అక్కడే అంత్యక్రియలు పూర్తిచేసి తమ నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు గతంలోనూ పలుమార్లు జరిగాయని, భూముల యజమానులు పదే పదే అడ్డుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. శ్మశానవాటిక భూమి ప్రభుత్వ ఆస్తి అని, దారిని అడ్డుకునేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీడీవో పంకజ్‌కుమార్ నిగమ్ స్పష్టం చేశారు.

## పారిశుద్ధ్య కార్మికుల్లో 66 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలే



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వంలో గ్రూప్-సీ క్యాటగిరీకి చెందిన పారిశుద్ధ్య కార్మికుల్లో (సఫాయి కర్మచారులు) 66 శాతానికి పైగా మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వారేనని కేంద్ర సిబ్బంది మరియు శిక్షణ విభాగం (డీఓపీటీ) 2024-25 వార్షిక నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం? గ్రూప్-సీ ఉద్యోగాల్లో సామాజికంగా వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఉన్నతస్థాయి ఉద్యోగాలైన గ్రూప్-ఏ పోస్టుల్లో మాత్రం ఈ ప్రాతినిధ్యం గణనీయంగా తక్కువగా ఉన్నది. గ్రూప్-ఏలో కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో ఎస్సీలు 14.2 శాతం, ఎస్టీలు 6.54 శాతం, ఓబీసీలు 19.14 శాతం మాత్రమే ఉన్నారు.కేంద్ర ప్రభుత్వంలో నేరుగా నియామకాలకు సంబంధించిన డీఓపీటీ నిబంధనల ప్రకారం..ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతం, ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్ అమల్లో ఉంది. అయితే, గ్రూప్-ఏ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రాతినిధ్యం వారికి కల్పించిన మొత్తం రిజర్వేషన్ శాతానికి కూడా తక్కువగా ఉన్నది. గ్రూప్-బీ పోస్టుల్లో ఎస్సీలు 16.2 శాతం, ఎస్టీలు 7.63 శాతం, ఓబీసీలు 21.95 శాతం ప్రాతినిధ్యం కలిగి ఉన్నారు. మొత్తంగా చూస్తే 80 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో పని చేస్తున్న 32.52 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎస్సీల ప్రాతినిధ్యం 16.84 శాతం, ఎస్టీలది 8.7 శాతం, ఓబీసీలది 26.32 శాతంగా ఉన్నది. అయితే, ఈడబ్ల్యూఎస్ ఉద్యోగుల ప్రాతినిధ్యంపై ఎలాంటి డేటానూ నివేదిక వెల్లడించలేదు. దిగువస్థాయి ఉద్యోగాల్లో సామాజిక న్యాయం కొంత వరకు ప్రతిబింబించి నప్పటికీ? ఉన్నతాధికార స్థాయిల్లో మాత్రం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రాతినిధ్యం ఇంకా తక్కువగానే కొనసాగుతోందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

## బోయినిపల్లి జడ్పీటీసీ రేసులో..

# అతికం రాజశేఖర్ గౌడ్

- బోయినిపల్లి మండలంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సభ్యత్వ నమోదు షురూ
- ప్రజా సమస్యల పరిష్కార దిశగా సింహమై ముందుకొస్తున్నా
- ఆశీర్వదించి, అవకాశం కల్పించాలి
- ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర నేత : అతికం రాజశేఖర్ గౌడ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ నేతృత్వంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "సింహమై ప్రజల ముందుకు వస్తున్నాను" అంటూ, ప్రతి ఒక్కరూ సింహం గుర్తుకు ఓటు వేసి తన విజయానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు వంశీ, గణేష్ తదితరులు పాల్గొని పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో

# అభివృద్ధి స్పష్టంగా వ్యక్తమవుతోంది


- కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తాం
- 27 వ వార్డుకు చెందిన బుట్టి లావణ్య - రమేష్ దంపతులు
- విప్ ఆది సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక



వేములవాడ.(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు గణనీయంగా కొనసాగుతున్నాయి. 27వ వార్డుకు చెందిన బుట్టి లావణ్య--రమేష్ దంపతులు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా పనిచేయాలని విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ఈ సందర్భంగా బుట్టి లావణ్య - రమేష్ దంపతులు మాట్లాడుతూ, "గత పదేళ్లలో వేములవాడ పట్టణ అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ప్రస్తుతం విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో పట్టణంలో రోడ్లు,మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జరుగుతున్న అభివృద్ధిని కొనసాగించాలంటే కాంగ్రెస్ పార్టీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. అదేవిధంగా వేములవాడలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా నిలుస్తామని బుట్టి లావణ్య - రమేష్ దంపతులు భరోసా ఇచ్చారు.

## సమ్మక్క సారాలమ్మ ను దర్శించుకున్న

## కాంగ్రెస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి



ఉప్పల్( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో మహా కుంభమేళగా చెప్పుకునే మేడారం జాతర లో సమ్మక్క సారక్క లను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గాయం శ్రీధర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, దేవేందర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ సమ్మక్క సారక్క లను దర్శించుకోవడం మహాభాగ్యమని కోరుకున్న వారికి కొంగు బంగారం అని అన్నారు. కోరిన కోర్కెలను అమ్మవారు నెరవేరుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నామని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేసిన ప్రజలకు ఇబ్బందులు కలవకుండా ఏర్పాట్లు చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నాచారం డివిజన్‌లో యుద్ధ వాతావరణం

### ప్రజలపై దాడులు చేస్తున్న దోమలు

**చేతులెత్తేసిన అధికారులు, కార్పొరేటర్**

**ఎర్రగుంట చెరువులో గుర్రపు డెక్క రాజ్యం**

**పలుమార్లు వచ్చి వెళ్లిన ఎమ్మెల్యే, సమస్య మాత్రం అలాగే**





నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం డివిజన్ ప్రజలు నేడు ఒక అదృశ్య శత్రువుతో యుద్ధం చేస్తున్నారు. తుపాకులు, కత్తులు కాదు, దోమల దాడులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా దోమలు ప్రజలపై దాడి చేస్తుండగా, పాలకులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారు. నాచారం పరిధిలోని ఎర్రగుంట చెరువు నేడు చెరువు కాదు, దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులో విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్క కారణంగా నీరు నిల్వ ఉండి, దోమలకు స్వర్గధామంగా మారింది. ఈ పరిస్థితి నెలల తరబడి కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కను చూపులో కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**దోమల నివారణలో పూర్తిగా విఫలం**

జిహెచ్ఎంసీ అధికారులు, మలేరియా విభాగం, హెల్త్ శాఖ, ఎవరి పని వారు చేస్తున్నారా.? అసలు చేయడం లేదా.? కూడా ప్రజలకు అర్థం కావడం లేదు. ఫాగింగ్ వాహనాలు కనిపించడం లేదు, లార్వా నివారణ చర్యలు శూన్యం. దీంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ ల భయంతో ప్రజలు నాచారం వణికిపోతున్నారు.

**కార్పొరేటర్ మౌనం, ప్రజల్లో ఆగ్రహం..**

నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ సమస్యను అసలు పట్టించుకోకపోవడంపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా, సోషల్ మీడియా ద్వారా సమస్యను సమాజం దృష్టికి, అధికారుల దృష్టికి, పాలకుల దృష్టికి తెచ్చిన సమస్యపై స్పందన పూర్తిగా కరువైందని ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ కు, ఎమ్మెల్యేకు ఓట్ల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తొస్తారా.? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఎమ్మెల్యే వస్తారు.. వెళ్లారు.. సమస్య అలాగే**

ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎర్రగుంట చెరువును పలుమార్లు సందర్శించిన శ్రీ అధికారులతో సమావేశాలు నిర్వహించిన గ్రౌండ్ లెవెల్‌లో మార్పు మాత్రం శూన్యం. ఫోటోలు, హామీలే తప్ప సమస్యను ఏనాడు పరిష్కరించిన దాఖలాలు లేవని దానితో ప్రజలకు ఊరట ఏమాత్రం లభించలేదు. దీంతో "సమస్య పరిష్కరించలేని ఎమ్మెల్యే ఎందుకు.?" అనే ప్రశ్న ప్రజల్లో మోగుతోంది. దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని అనారోగ్య బారిన పడుతున్న కుటుంబాలు దోమల కారణంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రాత్రిళ్లు నిద్ర లేక, పగలు పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది అన్నారు. దోమ కాట్లతో మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చి ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చు అవుతున్నా, ప్రభుత్వం నుంచి కనీస సహాయం లేదని తక్షణమే చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని పేర్కొంటున్నారు. ఎర్రగుంట చెరువులోని గుర్రపు డెక్కను వెంటనే తొలగించి నిత్యం ఫాగింగ్, లార్వా నివారణ చర్యలు చేపట్టాలని దోమల నివారణ పై వస్తున్న విధులను స్వాహా చేస్తున్నారని ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని నాచారం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైన పాలకులు మేల్కొనకపోతే నాచారం డివిజన్ ప్రజలు దోమలతో పాటు శ్రీస్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యే, అధికారులతో యుద్ధం మరింత భీకరంగా చేయడం ఖాయం.

## పిఎంజే జ్యూవెలర్స్‌లో సితార సందడి

నవ్వుల సితార పీఎంజే జ్యువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ ఘట్ట మనేని సితార నగరంలో సందడి చేసింది. హాఫ్-శారీ ఫ్యాషన్ షోలో తళుక్కున మెరిసింది. బంజారాహిల్స్ లో హోటల్ తాజ్ కృష్ణా వేదికగా పీఎంజే జ్యువెలర్స్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఆభరణాల ప్రదర్శన నగరవాసులును ఆకట్టుకుంది. ఫిబ్రవరి 2 వరకూ జరిగే ఈ ప్రత్యేక ఎగ్జిబిషన్లో 10,000కు పైగా డిజైనర్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ కుషాల్ కాంకారియా తెలిపారు. నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో పీఎంజే జ్యువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ ఘట్టమనేని సితార పాల్గొని సందడి చేశారు. ఇదే వేదికగా చిన్నారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హాఫ్ శారీ ఫ్యాషన్ షోలో పిల్లలతో పాటు సితార లగ్జరీ డిజైనరీ ఆభరణాలను ప్రదర్శించారు. వివా హాలు, హాఫ్ శారీ వేడుకలు, శుభకార్యాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎక్స్పరియన్స్ జోన్లు, పర్సనలైజ్డ్ స్టైలింగ్, డైమండ్ టెస్టింగ్ జోన్ ఈ ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

## 30 శాతంమధ్యంతర భృతి(ఐ ఆర్) ప్రకటించాలి..

**రుద్రవరం** ఎస్ టి యుదశల వారి ఉద్యమం లో భాగంగా పిఆర్సి ని ఏర్పాటు చేసి తక్షణం 30 శాతం ఐ ఆర్ ప్రకటించి మేనిఫెస్టో లో పేర్కొన్న మెరుగైన పిఆర్సి మరియు సిపిఎస్ రద్దు తదితర పెండింగ్ బకాయిల విడుదల ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల కు ఇచ్చిన హామీల ను ప్రభుత్వం అమలు చేయాలి అని ఎస్ టి యు ఏపీ రుద్రవరం మండల శాఖ ఆధ్వర్యంలో , రుద్రవరం తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఆదిశేషయ్య కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఎస్ కన్వీనర్ సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్టియుఆధ్వర్యంలో ఫిబ్రవరి -10 న జిల్లా కేంద్రాలలో తలపెట్టిన ధర్నాకు అలాగే ఫిబ్రవరి25 న ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉద్యోగులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ కన్వీనర్ ఎస్ హబీబుల్లా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురునాథ్, నరసింహారాజు, జిల్లా కౌన్సిలర్స్ ఉసేనయ్య, అబ్దుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ సిద్దేశ్వర స్వామి

# జాత్ర ఉత్సవాలు



**హోళగుంద** మండల కేంద్రంలో స్థానిక కొండ గుహలో స్వయంభువుగా వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి జాత్ర ఉత్సవాలు శుక్రవారం వసంతోత్సవంతో వైభవంగా ముగిశాయి. ప్రధానంగా చివరి రోజు అయిన శుక్రవారం శ్రీవారి సన్నిధిలో స్వామివారికి ఉదయం నుంచి వంశపారంపర్యం ఆలయ ధర్మకర్త రాజా పంపన్న గౌడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం స్వామి వారి ఆలయం నుంచి కొట్టురు బసవేశ్వర స్వామి దేవాలయం వరకు స్వామివారి ఉత్సవ విగ్రహ మూర్తులను పూల పల్లకిలో ఉంచి,మేళా తాళతో, సకల వాయిద్యాల నడుమ పురవిధుల గుండా ఊరేగింపుగా తరలి వెళ్లారు. అనంతరం స్థానిక బస్టాండ్ నందు గల కళ్యాణ మంటపంలో స్వామివారి పల్లకిని ఉంచి స్వామివారి ఉత్సవ విగ్రహ మూర్తిని పెద్ద బావికి తీసుకెళ్లి అక్కడ జలభిషేకం చేసి మహామంగల హారతి సమర్పించి తదనంతరం టపాసులు కాల్చి స్వామివారి పూల పల్లకిని అర్చకుల ఇంటికి చేర్చారు. ఈ కార్యక్రమంలో శివశంకర్ గౌడ,అమర గౌడ,సిద్దార్థ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పోషణకు రూ.10వేలు

## విరాళం ఇచ్చిన నూతన వధూవరులు

**ఏలూరు** వివాహాది శుభ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ఏదో ఒక మంచి కార్యక్రమం చేయాలనే ఉద్దేశంతో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఇటీవలే వివాహమైన షేక్ అయాన్, పాతీమునిషా దంపతులు రూ. 10వేల రూపాయలను సీతామహాలక్ష్మి వృద్ధుల వికలాంగుల ఆశ్రమానికి అందజేశారు. తమ స్నేహితుడైన తాడువాయి సెక్రటరీ సునీల్ , సిటీ డిజిటల్ నెట్వర్క్ సిటీ కేబుల్ రిపోర్టర్ నాగసూరి బాలసుబ్రమణ్యంల ఆధ్వర్యంలో పదివేల రూపాయలను అందజేయడంపై ఆశ్రమ నిర్వాహకులు జయవరపు శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఆశ్రమంలో ఉన్నటువంటి వృద్ధులకు ,వికలాంగులకు ఈ నగదు ఎంతో దహదపడుతుందని అన్నారు. ఈ ఆశ్రమంలో 25 మంది ఆశ్రయం పొందుతున్నారని అన్నారు. దాతలు మరింతగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. దూత ఉంటే దాతకు కొదవలేదని అన్నారు. షేక్ అయాన్ , పార్టీ మునిషాలను ఆదర్శంగా తీసుకోవాలని శేఖర్ తెలియజేశారు

## పిడుగురాళ్లలో ఎన్టీఆర్ భరోసా

# పింఛన్ల పంపిణీ

**పాల్గొన్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని**



**పిడుగురాళ్ల,** పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని, పిడుగురాళ్ల పట్టణంలోని 29వ వార్డుకు చెందిన వివిధ రకాల పింఛన్ దారులకు పింఛన్లను పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ ఇరువూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, మరియు సచివాలయ సిబ్బంది, పింఛన్ లబ్ధిదారులు, పిడుగురాళ్ల పట్టణంలోని వివిధ హోదాల్లో వున్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు పాల్గొనటం జరిగింది.

## వనపర్తి జిల్లా కొత్తకోట బీసీ బాలికల వసతి

## గృహంలోవిద్యార్థినుల అస్వస్థత పై ఆందోళన వద్దు



**వనపర్తి.** విషయం తెలిసి హుటా హుటిన ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని నేరుగా తెలుసుకున్న ఎమ్మెల్యే. కొత్తకోట బీసీ బాలికల వసతి గృహంలో అస్వస్థతకు గురైన బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. అస్వస్థతకు గురైన బాలికలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో వసతి గృహ వార్డెన్స్ తో మాట్లాడి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి ఆయన సూచించారు

## కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న చేరికల పర్వం



**వనపర్తి** పెబ్బేరు ఃఖీూ పార్టీ నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి చేరికలపర్వం కొనసాగుతోంది. శుక్రవారం పెబ్బేరు పట్టణానికి చెందిన 4వ వార్డు 6వ వార్డు 9వ వార్డులలోని ఃఖీూ మాజీ అధ్యక్షులు తాటికొండ ఆంజనేయులు మరో 53 మంది ఃఖీూ నాయకులు కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఈ సందర్భంగా వనపర్తి నందిహిల్స్ లో గల ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులకు 12 వార్డులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించేల ప్రతి ఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు, పెబ్బేరు విషయం మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు, విజయ వర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెబ్బేరు పట్టణ మాజీ అధ్యక్షులు వెంకట్రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రంజిత్ కుమార్, సదానంద రెడ్డి (చిట్టిబాబు) శివ, రణధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇరుముడి సినిమాలో మాస్ మహారాజ్ డబుల్ రోల్ చేయనున్నాడా?

టాలీవుడ్ స్టార్ హీరో మాస్ మహారాజ్ రవితేజ నటిస్తున్న తాజా సినిమా 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భారీ నిర్మాణాల సంస్థ మైత్రీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇక దీనికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ మూవీ ఫాదర్ సెంటిమెంట్, పాప ఎమోషన్స్ తో పాటు బలమైన యాక్షన్ రివెంజ్ డ్రామాగా తెరకెక్కనుందట. ఈ క్రమంలో ఈ మూవీకు సంబంధించిన మరో న్యూస్ నెట్టింట షికారు చేస్తోంది. అదేంటంటే.. ఈ సినిమా కథ, కథనం, పాత్రల చిత్రణ వైవిధ్యంగా ఉంటాయని సమాచారం. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఈ సినిమాలో రవితేజ డబుల్ రోల్ ప్లే చేయనున్నారట. అయితే రెండూ పాత్రలు చేయడం రవితేజకు కొత్తేం కాదు. ఇప్పటికే చేసిన సినిమాలు మంచి విజయాలు సాధించాయి. అయితే.. ఈ పాత్రల్లోని వేరియేషన్స్ మాత్రం చాలా బాగా కుదిరాయని టాక్ వినిపిస్తున్నది. మరి ఇందులో నిజమెంతుందో తెలియాలంటే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే.

# ఏఆర్ రెహమాన్‌కు టాలెంట్ లేదు



బాలీవుడ్‌లో మళ్లీ మత వివక్షపై చర్చ మొదలైంది. ఆస్కార్ అవార్డు విన్నర్ మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్.రెహమాన్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో, ప్రస్తుతం ఇండస్ట్రీలో క్రియేటివ్ వ్యక్తులు కాకుండా ఇతరులు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. కొన్నిసార్లు నియామకాల విషయంలో మతపరమైన పక్షపాతం ఉండొచ్చని అనిపిస్తోందని చెప్పారు. అయితే తన విషయంలో మాత్రం ఎప్పుడూ ప్రత్యక్షంగా అలాంటి వివక్షను ఎదుర్కోలేదని రెహమాన్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు కాస్త వివాదాస్పదంగా మారడంతో ఆయన వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ ఈ వివాదానికి ఇంకా చెక్ పడినట్లు లేదు. నిత్యం దీనికి సంబంధించిన ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బాలీవుడ్ నటి రాణి ముఖర్జీ షాకింగ్ కామెంట్స్ చేసింది. తాను గత 30 ఏళ్లుగా బాలీవుడ్‌లో పనిచేస్తున్నానని, ఈ సమయంలో మతం లేదా కులం ఆధారంగా ఎలాంటి వివక్షను చూడలేదని ఆమె అన్నారు. బాలీవుడ్ అత్యంత సెక్యులర్ ఇండస్ట్రీ అని, ఇక్కడ ప్రతిభకే ప్రాధాన్యం ఉంటుందని రాణి తెలిపారు. ఈ ఇండస్ట్రీ తనను ఈ స్థాయికి తీసుకొచ్చిందని, హృదయపూర్వకంగా ఈ మాటలు చెబుతున్నానని ఆమె వ్యాఖ్యానించారు. ఇక బాలీవుడ్‌లో విజయం సాధించాలంటే ప్రేక్షకులతో కనెక్ట్ కావడం కీలకమని రాణి ముఖర్జీ అన్నారు. ఎవరి పని వాళ్ల గురించి మాట్లాడుతుందని, ప్రేక్షకులు ఎవరిని ఆదరిస్తారో వారే ఇండస్ట్రీలో నిలబడతారని చెప్పారు. అంటే ఇండైరెక్ట్‌గా ఆయనకు టాలెంట్ లేదని చెప్పకనే చెప్పింది. ప్రజలు ఆదరించకపోవడం వల్లనే ఆయన హిందీలో రాణించలేకపోయారని అన్నదని అంతా రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఈ కామెంట్స్ నెట్టింట దుమారం రేపుతున్నాయి. కాగా.. రాణి ముఖర్జీ ' మర్దానీ-3' సినిమాతో ప్రేక్షకులను అలరిస్తోంది.

# మన టైమ్ స్టార్ట్ అయింది



ఈ సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి వచ్చిన సినిమాల్లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కించిన హారర్-ఫాంటసీ మూవీ 'ది రాజా సాబ్' కూడా ఒకటి.సంక్రాంతి రేస్‌ను ముందుగా ప్రారంభించిన ఈ చిత్రం.. భారీ అంచనాలు క్రియేట్ చేసినప్పటికీ, థియేటర్లలో మాత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. బాక్సాఫీసు వద్ద డిజాస్టర్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమా నెలరోజులకే డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఇప్పటికే ఓటీటీ విడుదలపై పలు వార్తలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా.. ఆ వార్తలకు చెక్ పెడుతూ అధికారిక ప్రకటన విడుదల చేసింది ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్. ఈ సినిమా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది. మన టైమ్ స్టార్ట్ అయింది..భారతదేశపు అతిపెద్ద సూపర్ స్టార్ మాయాజాలంలో మునిగిపోవడానికి సిద్ధంగా ఉండండి" అనే క్యాప్షన్ జత చేశారు. అయితే ఇక్కడ ఓ ఆసక్తికర విషయం ఏమిటంటే.. ఈ మూవీ కేవలం తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో మాత్రమే స్ట్రీమింగ్ చేయనున్నట్లు సమాచారం. హిందీ వెర్షన్‌పై మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు థమన్ సంగీతం అందించగా.. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. థియేటర్లలో ఆశించిన ఫలితం దక్కని ఈ సినిమా.. ఓటీటీలో అయినా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# ఓటీటీలోకి 'నారి నారి నడుమ మురారి'




చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, రామ్ అబ్బారాజు దర్శకత్వంలో వచ్చిన సంక్రాంతి హిట్ చిత్రం 'నారి నారి నడుమ మురారి' ఓటీటీ విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ, పెద్ద సినిమాల పోటీని తట్టుకుని బాక్సాఫీస్ వద్ద సుమారు?34 కోట్ల గ్రాస్ వసూళ్లతో సూపర్ హిట్‌గా నిలిచింది. పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ప్రశంసలు అందుకున్న ఈ సినిమా, విడుదలైన నెలరోజుల లోపే డిజిటల్ స్ట్రీమింగ్‌కు వస్తుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ? ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకోగా.. ఫిబ్రవరి 4 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా అందుబాటులోకి రాబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించింది. "ప్రేమ, అబద్ధాలు గందరగోళంతో కూడిన ఈ కలయికను చూసేందుకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము" అనే క్యాప్షన్ జత చేశారు. ఒకే ఇంట్లోని ఇద్దరు అమ్మాయిల మధ్య నలిగిపోయే యువకుడి కథను దర్శకుడు అత్యంత హాస్యభరితంగా తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. ?శర్వానంద్ సరసన సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు అతిథి పాత్రలో మెరిసి సర్ ప్రైజ్ ఇచ్చారు. వెన్నెల కిశోర్, సత్య, నరేష్‌ల కామెడీ ట్రాక్ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించింది. థియేటర్లలో ఈ ఫన్ రైడ్‌ను ఎంజాయ్ చేయలేకపోయిన వారు, ఫిబ్రవరి మొదటి వారం నుంచి తమ ఫ్యామిలీతో కలిసి ఇంట్లోనే ఈ సినిమాను చూడొచ్చు.

# అందరూ కనెక్ట్ అయ్యే ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్




అభిషన్ జీవింత్, అనస్వర రాజన్ ప్రధాన పాత్రలలో నటించిన ఫీల్-గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'విత్ లవ్'. మదన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్‌తో పాటు నజరత్ పసిలియన్, మహేష్ రాజ్ పసిలియన్ ఎంఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ సురేష్ ప్రొడక్షన్స్ నిర్వహిస్తోంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ,'ట్రైలర్ చూసిన అందరూ చాలా కనెక్ట్ అయ్యారు. చూస్తున్నప్పుడు ఇది మన కథే అనిపిస్తోంది. సౌందర్య తెలుగులో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ''టూరిస్ట్ ఫ్యామిలీ'కి మీరందరూ గొప్ప ఆదరణ ఇచ్చారు. ఇది కూడా చాలా అద్భుతమైన ఎమోషన్ ఉన్న సినిమా. అందరూ కూడా కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. మన జ్ఞాపకాలని నెమరు వేసుకునేలా ఉంటుంది. రానా ఈ సినిమాని మరింత గొప్ప స్థాయికి తీసుకువెళ్లారు. ఈ సినిమాతో తెలుగులోకి రావడం చాలా ఆనందంగా ఉంది' అని హీరో అభిషన్ జీవింత్ చెప్పారు. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ,'ఇది చాలా క్యూట్ సినిమా. అందరూ కూడా సినిమాని థియేటర్‌లో చూసి ఆస్వాదిస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు. ప్రొడ్యూసర్ సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ,'ఈ సినిమాని తెలుగులోకి తీసుకురావడం నాకు చాలా ఆనందంగా ఉంది. రానాకి ఈ సినిమా గురించి చెప్పగానే తన సినిమాగా ముందుకు తీసుకొచ్చారు. ఆయన ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. అభిషన్‌ని హీరోగా లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. తను డైరెక్టర్‌గా మంచి సక్సెస్ ఇచ్చాడు. ఈ సినిమాలో అద్భుతంగా పెర్ఫార్మ్ చేశాడు. అనస్వర ఆల్రెడీ తెలుగులో సినిమాలు చేస్తోంది' అని అన్నారు. 'రానా ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. చాలా ప్రేమతో ఈ సినిమా చేశాము. 'టూరిస్ట్ ఫ్యామిలీ'లానే ఈ సినిమాని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నాను' అని ప్రొడ్యూసర్ మహేష్ రాజ్ తెలిపారు.

# అంచనాలకు మించి..



విజన్ మూవీ మేకర్స్ బ్యానర్ పై సాయి సుధాకర్ కొమ్మాల పాటి నిర్మాతగా ఎంఎం నాయుడు రచన దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'సుమతీ శతకం'. అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటిస్తున్నారు. ఫిబ్రవరి 6వ తేదీన మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ప్రేక్షకుల ముందుకు ఈసినిమా రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర బృందం శుక్రవారం తిరుపతిలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాయుడు మాట్లాడుతూ,'ఇందులో కామెడీతో పాటు సస్పెన్స్, డివోషనల్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి. ఈ చిత్రం మీ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుంది' అని అన్నారు. 'మా ప్రమోషన్ కార్యక్రమాలను రాయలసీమ నుంచే ప్రారంభించాం. కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాల్లో ప్రేక్షకుల ఆదరణ అద్భుతంగా ఉంది. ముఖ్యంగా నిన్న నా సొంత ఊరు మదనపల్లిలో, ఇప్పుడు ఇక్కడ తిరుపతిలో మాకు దక్కిన రెస్పాన్స్ మరువలేనిది. మా చిత్రాన్ని 'మైత్రి మూవీ మేకర్స్' ద్వారా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. ఈ చిత్రం పక్కా కామెడీతో కూడిన ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా మిమ్మల్ని అలరిస్తుంది' అని నిర్మాత సుధాకర్ చెప్పారు.

# ఐశ్వర్య రాజేష్ సెన్సేషనల్ కామెంట్స్

టాలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అందరికీ సుపరిచితమే. తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి మెప్పించి తనకంటూ స్పెషల్ క్రేజ్‌ను రాబట్టుకుంది. అయినప్పటికీ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో ఏడాది పాటు సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చింది. మళ్లీ గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. దీంతో తోలుగులో వరుస చాన్సులు వస్తున్నాయి. ప్రస్తుతం తిరువీర్ సరసన 'ఓ సుకుమారి' మూవీలో నటిస్తోంది. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను మహేశ్వరరెడ్డి మాలి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి వరుస అప్డేట్స్ వస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇక ఈక్రమంలో.. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ఐశ్వర్య రాజేష్ పలు షాకింగ్ విషయాలు పంచుకుంటూ.. వార్తల్లో నిలుస్తోంది. తాజాగా, తన జీవితంలో జరిగిన ఓ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకుని ఎమోషనల్ అయింది. "నా కెరీర్ స్టార్టింగ్‌లో నేను ఒక సినిమా అడిషన్స్‌కి వెళ్లాను. ఆ డైరెక్టర్ నన్ను సెక్సీ బట్టలు.. నైట్ డ్రెస్సులో కనిపించు అన్నాడు. ఎందుకంటే.. అతను నా బాడీ చూడాలని అన్నాడు. ఆ సమయంలో నాకు చాలా కోపం వచ్చింది. ఇలా ఎంతమందిని అడిగి ఉంటాడు అని తర్వాత అనుకున్నాను. ఆ తర్వాత చాలా బాధపడ్డాను. ఈ ఘటనను నేను ఎప్పటికీ మర్చిపోలేను" అని ఆవేదన వ్యక్తం చేసింది. కానీ ఆ డైరెక్టర్ పేరును మాత్రం రివీల్ చేయలేదు.



## ఉద్యోగ విరమణ ముగింపు కాదు...
# సేవా ముద్ర శాశ్వతం

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు : ఏనుగుల కనుకయ్య**



బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్) ఉద్యోగ జీవితానికి విరమణ ముగింపు అయినా, సేవా ముద్ర శాశ్వతమని విలాసాగర్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య అన్నారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ఆంజనేయ స్వామి దేవస్థానం ఈఓ నాగారపు శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని అభినందించారు. దేవాదాయ శాఖలో 36 ఏళ్ల సేవలతో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించడం ప్రశంసనీయమన్నారు. ఆలయ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడుతూ, రిటైర్మెంట్ అనంతరం కూడా సలహాలు అందించాలని కోరారు. శ్రీనివాస్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.వారి వెంట విలాసాగర్ పురాతన త్రిలింగ సంగమేశ్వర ఆలయం ప్రధాన అర్చకులు గణపతి, తదితరులు ఉన్నారు.

# కిష్టాపూర్ గ్రామంలో సర్పంచ్ స్వప్న ఊశయ్య ఆధ్వర్యంలో గ్రామసభ

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో శనివారం నాడు గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది గ్రామంలో పలు అభివృద్ధి అంశాల పైన పంచాయతీ సెక్రెటరీ కృష్ణ, మమత గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది తద్వారా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని అభివృద్ధి లో సర్పంచ్ ల పాత్ర చాల ముఖ్య మని, గ్రామాని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తానని పంచాయతీ పాలన విధులు,అభివృద్ధి కి సంబందించిన గ్రామాల అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు.సర్పంచ్ లు బాగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచిపేరువస్తుందన్నారు.పంచాయతీ రాజ్ చట్టం లో సర్పంచ్ లకు పొందు పరిచిన అధికారాలు, విధులు తదితర అంశాల ను శిక్షణ లో ఉన్నాయన్నారు.ఇందిరమ్మ ఇండ్లు పాఠశాల ల నిర్మాణం పనులు, సన్న బియ్యం పంపిణీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గ్రామం లో అమలు పరచాలని అన్నారు.గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడడం లాంటి ప్రధాన అంశాల్లో చర్చించారు గ్రామ ప్రజలు నమ్మకంతో గెలిపించిన సర్పంచ్ గా బాధ్యతలు చురుకుగా పని చేయాలిసిన అవసరం ఉందన్నారు. ప్రతీ గ్రామం శుభ్రంగాఉంచాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టం లోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాలు, ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని గ్రామ సర్పంచ్ సాదులో స్వప్న ఉషయ్య తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వార్డు మెంబర్స్ అక్కే ప్రవీణ్, పసుల ప్రసాద్, ఏంబరి మల్లేశం, చాకలి యశోద, బొక్కల శేఖర్, తోశ నవీన్, పెద్దల కిషన్, నకిర్త పెంటమ్మ, పసుల రేఖ, అంగనవాడి టీచర్లు శ్రీ మతమ్మ, శోభ, ఆశ వర్కర్ నాశమ్మ, సి ఎ యాదమ్మ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం

**అవగాహన సదస్సు - నూతన ఓటర్లకు సన్మానం**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) మేరా యువభారత్ బీసీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకట రాంబాబు (మై భారత్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్) హాజరై, యువత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకొని తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అనురాధా మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తూ అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగిపల్లి స్వామి కుమార్, పూసాల సంతోష్, నెల్లిమెల రజనీకాంత్, ధనుష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మొత్తం 130 మంది విద్యార్థినీ-విద్యార్థులు, యువతీ-యువకులు హాజరుకాగా, కొత్తగా ఓటు హక్కు పొందిన యువతను సన్మానించారు.

# అందుబాటులో ఉండి ప్రజాసేవ చేయడమే నా లక్ష్యం

**రాంపూర్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా**

**సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేయడమే నా లక్ష్యమని సర్పంచ్ నేల్లి సంగమేశ్వర్ తెలిపారు శనివారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో తాగునీటి సమస్య ఉన్న నాలుగో వార్డ్ లో నూతనంగా బోరు వేశారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు అనంతరం మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్ల ఇరువైపులా మొరం వేయడం జరిగిందని పేర్కొన్నారు పారిశుధ్యం కార్మికులతో గ్రామంలో మురికి కాలువలను తీయడం జరిగిందని తెలిపారు అలాగే ప్రజల దాహార్తి సమస్యను పరిష్కరించడం కోసం ప్రత్యేక దృష్టి పెడదామని తెలిపారు గ్రామాన్ని రంగాలలో అభివృద్ధి చేసి జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయతీ తీర్చిదిద్దడమే నా లక్ష్యమని పేర్కొన్నారు పేద ప్రజల కోసం గ్రామంలో ఏ సమస్య ఉన్నా అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరించే అంతవరకు కృషి చేస్తానన్నారు విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలో తిరిగి ఎక్కడ ఎక్కడ కరెంటు స్తంభాలు వైర్ల సమస్యలు ఉన్నాయని పరిశీలించిరూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు రాంపూర్ ఇంద్రనగర్ కాలనీలో మెయిన్ వేరు ఇండ్లపై నుంచి వెళ్లడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఏ ఈ. మహమూద్ లైన్మెన్ అప్సర్ ఉప సర్పంచ్ శ్రీశైలం వార్డు సభ్యులు రాందాస్ స్వరూప బాలమని మంగమ్మ సాయిలు సునీత గ్రామస్తులు గోవర్ధన్ రెడ్డి పోచయ్య మోహన్ ప్రశాంత్ గురు ప్రసాద్ అనిల్ రవి గణేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు

# కేసీఆర్‌పై పోలీసుల వైఖరి దుర్మార్గం

**- కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు చర్యలపై ప్రజలే సరైన తీర్పునిస్తారు**

**- రాత్రిపూట నోటీసులు అంటించడం అహంకారానికి నిదర్శనం**

**- బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు : అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్ర సాధకుడు,రాష్ట్ర తొలి,మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై ప్రజా ప్రభుత్వం, పోలీసులు అనుసరిస్తున్న వైఖరి ప్రజాస్వామ్యానికి మచ్చ అని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ అన్నారు.కేసీఆర్ స్వయంగా తన నివాస చిరునామాను స్పష్టంగా తెలియజేసినా, ఆయన లేని ఇంటికి రాత్రిపూట నోటీసులు అంటించడం అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. 65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసంలోనే విచారించాలన్న నిబంధనలను కూడా పోలీసులు విస్మరించారని ఆరోపించారు.అక్రమ కేసులను చట్టపరంగా ఎదుర్కొంటామని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ తప్పుడు చర్యలను ప్రజల ముందు బయటపెడతామని అనుముల భాస్కర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న వేధింపులను తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే సరైన తీర్పు ఇస్తారని అన్నారు.

# చదువుకో తెలంగాణ మిషన్ పోస్టర్ ఆవిష్కరణ



తార్నాక(ప్రశ్న న్యూస్) చదువుకో తెలంగాణ మిషన్ టెన్త్ క్లాస్ అనే నూతన కార్యక్రమానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్ ను జనసమితి అధినేత కోదండరాం ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే 10 వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించడానికి మెరిట్ స్టూడెంట్స్ కు నగదు బహుమతి ఇస్తున్నట్లు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్ హెడ్ భాస్కర్, డీజీఎం వేంకట కృష్ణ తెలిపారు. తార్నాక లోని కోదండరాం నివాసం లో పోస్టర్ ఆవిష్కరణ అనంతరం హెడ్ భాస్కర్ మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ వచ్చిన విద్యార్థికి 5 లక్షలు, సెకండ్ టాపర్ కు 3 లక్షలు, జిల్లా టాపర్ కు 2 లక్షలు, నియోజక వర్గ టాపర్ 1 లక్ష, మండల స్థాయి టాపర్కు 10,000 నగదు ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. 3000 ప్రభుత్వ పాఠశాలల నుండి సుమారు 3 లక్షల మంది పదవ తరగతి పరీక్షలు కు హాజరుకానున్నారనీ తెలిపారు. కోదండరాం మాట్లాడుతూ సుమారు 600 మంది ఈ ప్రైస్ మనీ అందుకునే అవకాశం ఉందని, ఇందుకోసం 2 కోట్ల 2 లక్షల రూపాయలను అందిస్తున్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ను అభినందించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరచడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం లు మురళి, రాజశేఖర్, డివిజనల్ మేనేజర్ సతీష్, జస్వంత్ కుమార్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలి: పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు



తార్నాక(ప్రశ్న న్యూస్)నగర వ్యాప్తంగా పోస్ట్ ఆఫీస్ లలో పనిచేస్తున్న పోస్ట్ మెన్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పోస్ట్ మెన్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ అశోక్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ రీజియన్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరసన కార్యక్రమానికి నగరవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ లలో తమకు సరైన మౌలిక సదుపాయాలు లేవని ఆరోపించారు. అన్ని డెలివరీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు అయిన త్రాగునీరు, టాయిలెట్, ఉద్యోగులకు కూర్చునే వసతి లేక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పోస్ట్ ఆఫీస్ లలో సరిపడా సిబ్బంది లేక తమపై పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిందని సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేసి తమపై పని భారాన్ని తగ్గించాలని కోరారు. లీవ్ ఽ ఖాళీ పోస్ట్ మెన్ , ఎంటిఎస్ పోస్టులకు సబ్స్టిట్యూట్ లను వెంటనే నియమించాలన్నారు. ఇప్పటికే పని చేస్తున్న సబ్స్టిట్యూట్లకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం పని సమయాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పోస్ట్ మెన్, ఎంటీఎస్ లకు సంబంధించిన పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సెలవు దినం అయినా కూడా తమతో బలవంతంగా ఆదివారం కూడా పని చేయిస్తున్నారని మండిపడ్డారు. అన్యాయమైన పని భారం పెంపు విధానాలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ లను పరిష్కరించని నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులతో 1000 మందితో పెద్ద ఎత్తున ఇందిరా పార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీజేసీఏ నాయకులైన ఎం మధుసూదన్ రావు, కృష్ణ, షేక్. లాల్ మియా, మొహమ్మద్, వై ప్రసాద్, శ్రీనివాస చారి, డివిజన్లోని డివిజనల్ ప్రెసిడెంట్లులు, కార్యదర్శులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మైనర్ల రాష్ డ్రైవింగ్ పై వేములవాడ పట్టణ పోలీసుల చెక్

**- మైనర్ల ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై తల్లిదండ్రులదే బాధ్యత**

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్**

**- మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో శనివారం ఒకే ద్విచక్ర వాహనంపై ఐదుగురు మైనర్లు మితిమీరిన వేగంతో ప్రయాణించిన ఘటనపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో మైనర్లను అదుపులోకి తీసుకున్న పట్టణ పోలీసులు, వారి తల్లిదండ్రులను పిలిపించి వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్లో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్.ఐల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూమైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం మోటారు వాహన చట్టం ప్రకారం నేరమని, ఒకే బైక్‌పై పరిమితికి మించి ప్రయాణించడం ప్రాణాంతకమని పోలీసులు వివరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, రాష్ డ్రైవింగ్‌పై ఇకపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

# కెవిపిఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) హత్నూర మండలం పోలీస్ స్టేషన్లో ఎస్సై శ్రీధర్ రెడ్డి. ఆధ్వర్యంలో కేవీపీఎస్. నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు అనంతరం హత్నూర గ్రామపంచాయతీ నూతన సర్పంచ్. నల్లోల్ల ఎల్లయ్య ఆధ్వర్యంలో కూడా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో. కెవిపియస్ హత్నూర మండల నాయకులు. కే శేఖర్ మాట్లాడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలకడం అంటే క్యాలెండర్ మార్పు మాత్రమే కాదు ఆలోచనల పరిణామంలో కూడా మార్పు రావాలి ప్రతి ఒక్కరు మహనీయుల బాటలో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరుకుంటూనాన్ను. అని అన్నారు ఈ కార్యక్రమంలో. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కే.నాగేష్. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పొట్లగళ్ల ప్రవీణ్. తెలంగాణ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి నర్సాపూర్ అధ్యక్షులు. మీనంపల్లి శ్రీశైలం. నాయకులు కే వంశీ. రాజు. సురేష్. తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు

**- కేటీఆర్ పిలుపు మేరకు నిరసనలు వ్యక్తం**

**- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు : కత్తెరపాక ఉమా కొండయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) పిలుపుతో సిట్ విచారణలో భాగంగా పోన్ ట్యాపింగ్ పేరిట తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును విచారించడాన్ని నిరసిస్తూ నేడు ఆదివారం ఉదయం 10:00 గంటలకు బోయినిపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షులు కత్తెరపాక ఉమా కొండయ్యతెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరుగుతున్న చర్యలను ఖండిస్తూ ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు.

# నిధి కోసం కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని కూల్చారా.?

**ఒక్క దేవాలయానికి మూడు ఇల్లీగల్ కమిటీలు ఏంటి.?**

**ఆలయ అభివృద్ధి పేరుతో వసూలు చేస్తున్న డబ్బంతా ఎటు పోతుంది.?**


**ఓ మాజీ మంత్రి ఈ ఆలయ పై రాజకీయం చేయడంపై స్థానికులు ఆగ్రహం**

**హైకోర్టును ఆశ్రయించిన నాగిళ్ల శ్రీనివాస్ స్టే ఇచ్చిన హైకోర్టు**

**ఒక్క దేవాలయానికి మూడు కమిటీల డబ్బుల కోసమేనా.?**

**ఎండోమెంట్, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు లేకుండా కూల్చివేయడం వెనుక అంతర్యం ఏమిటి.?**

**నిధి కోసమే ఈ దేవాలయాన్ని కూల్చివేసినట్టు స్థానికులలో చర్చ**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ లోని ఆవులమంద లో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నిర్మాణంపై తెలంగాణ హైకోర్టు స్టేటస్కో మెయింటైన్ చేయవలసిందిగా మూడు ఇల్లీగల్ కమిటీస్ కి ఆర్డర్ జారీ చేశారు.త్వరలో ప్రభుత్వం ఈ దేవస్థానం కూల్చివేతపై సిబిసిఐడి కి ఇస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కూల్చివేతపై పూర్తిస్థాయిలో విచారణ కోసం స్పెషల్ ఆఫీసర్ ని నియమిస్తున్నట్టు చర్చ జరుగుతోంది.ఈ వ్యవహారం అంతా ప్రభుత్వం మెడకు చుట్టుకుంటుందని కొంతమంది అధికారులలో ఆందోళన వ్యక్తమౌతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా భవిష్యత్తులో ఎవరు కూడా ఇతర దేవాలయాలను కూల్చకుండా ఒక గుణపాఠంగా ఈ దేవాలయం 3 ఇల్లీగల్ కమిటీల పైన యాక్షన్ తీసుకోవాలని కొంతమంది స్థానికులు కోరుతున్నారు.శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్యుల కులదేవత ఈ దేవస్థానం బుక్ ఆఫ్ ఎండోమెంట్లు 1356 ఫస్ట్ లో రిజిస్టర్ చేశారు. అత్యంత పురాతనమైన దేవాలయం నిధి కోసం కొంతమంది ఇల్లీగల్ గా మూడు కమిటీలు ఏర్పరచుకొని ఈ దేవస్థానం పైన అధిపత్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా దేవస్థానాన్ని పూర్తిగా కూల్చి వేయడం జరిగింది. ఈ దేవస్థానం పురాతనమైపోయిందని కొత్త దేవాలయం కడుతున్నామని, గత కొద్ది సంవత్సరాల నుంచి తెలంగాణ రాష్ట్ర దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగేల్ల శ్రీనివాస్ ఈ దేవాలయం గురించి న్యాయపరమైన పోరాటం చేస్తున్నారు. అతను ఈ దేవాలయంని కాపాడుకోవడానికి అనేక విధాలుగా ప్రయత్నించిన ఎండోమెంట్ డిపార్ట్మెంట్, మున్సిపల్ డిపార్ట్మెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్, పోలీసు డిపార్ట్మెంట్, ఈ నాలుగు డిపార్ట్మెంట్లని ఇల్లీగల్ కమిటీలు మేనేజ్ చేసి ఎటువంటి పర్మిషన్లు లేకుండా టిహెచ్ఎంసి పర్మిషన్ గాని దేవాదాయ శాఖ పర్మిషన్ కానీ రెవెన్యూ పర్మిషన్ తీసుకోలేదని ఎటువంటి పర్మిషన్ లేకుండా దేవస్థానాన్ని ఇల్లీగల్ కమిటీలు కూల్చివేసి తిరిగి నిర్మాణం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానితోపాటు గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న అమ్మవారిని తీసుకెళ్లి మొదటి అంతస్తులు ప్రతిష్టించడం శాస్త్రాలకు, వేదాలు విరుద్ధమని శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల అనుమతులు లేకుండా నిబ్బందులకు విరుద్ధంగా నిర్మించడంపైనాగిల్ల శ్రీనివాస్ గత కొద్ది సంవత్సరాలుగా అధికారులకు ఎన్ని విధాల కంప్లైంట్ ఇచ్చినా కూడా వాళ్ళు పట్టించుకోవడం లేదని ఈ ఇల్లీగల్ కమిటీలు ఒకరి కమిటీ మరొక కమిటీ పైన ఇంకో కమిటీ క్రిమినల్ కేసులు కూడా వేసుకోవడం జరిగిందన్నారు. గుడికి వస్తున్న ఆదాయపు లెక్కల్లో పొరపాటు వచ్చినయని చెప్పి వాళ్ళలో వాళ్లకి క్రిమినల్ కేసులు కూడా నడుస్తున్నాయని దేవాలయాన్ని వాళ్ళ అక్రమాల కోసం వాడుకోవడం పై మండిపడ్డారు. ఈ ఇల్లీగల్ కమిటీల సభ్యులు ప్రజల నుండి దాదాపు 16 కోట్ల వసూలు చేసినట్టు వినికిడి నడుస్తుందన్నారు. ఈ దేవాలయం వెనక ఒక బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రి హస్తం ఉన్నట్టు స్థానికంగా చర్చ జరుగుతోందని వాళ్ల అండతోనే ప్రభుత్వ శాఖల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా నిధి కోసం తవ్వినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగిళ్ల శ్రీనివాస్ గత కొన్ని నెలల క్రితం హైకోర్టులో కేసు వేయడం జరిగిందని ఈ దేవాలయాన్ని ఎండోమెంట్ స్వాధీనం చేసుకోవాలని, ఏవైతే ఇల్లీగల్ గా అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని డబ్బులు, ఇతర సామాగ్రి వసూలుకు పాల్పడ్డారు వాటిని స్వాధీనం చేసుకునే విధంగా స్పెషల్ ఆఫీసర్ నీ నియమించవలసిందిగా కోర్టును, ఎండోమెంట్ శాఖను శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వ శాఖలో కొంతమంది అధికారులు కుమ్మక్కై ఎండోమెంట్స్, రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ అధికారులు కోర్టులో కావాలని వాయిదాల మీద వాయిదాలు వేసి డేట్లు తీసుకుంటున్నారని కౌంటర్ ఫైల్ కావాలని చేయడం లేదన్నారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ అభివృద్ధి కోసం నిధులు సేకరించి కమిటీ సభ్యుల వద్ద కొంతమంది భక్తులు నిధులు ఇచ్చిన తర్వాత గుడి పై వస్తున్న ఆరోపణపై స్పందించి పర్మిషన్ పత్రాలు చూపించాలని అభివృద్ధి కోసం తాము ఇస్తున్న డబ్బులను ఎలా ఉపయోగిస్తున్నారని ప్రశ్నించడంతో ఒక్కొక్క కమిటీ సభ్యులు ఒక్కొక్క కట్టు కదా చెబుతున్నారని దానితో భక్తుల సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక కమిటీ పద్మావతి కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సోమ ఆనంద్ కుమార్, చందా బాలేందర్ గ్రూప్స్, గౌరీ శంకర్ గ్రూప్ ఈ మూడు గ్రూపులు కలిసి కలెక్షన్ చేస్తున్నట్టు నాగిళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం అంటే భక్తులలో ఒక భక్తి భావం ఉంటుందని దానితో ఆలయ అభివృద్ధి కోసం భారీగా నిధులు ఇవ్వడం జరుగుతుందని దానిని ఆసరాగా చేసుకుని మూడు లీగల్ కమిటీలు సొమ్ము చేసుకుంటున్నాయని దేవిని పేరుతో చేస్తున్న ఈ అరాచకాన్ని అరికట్టాలని రాజకీయ నాయకులు దీని వెనక ఉండి ఇలా చేయడం బాధాకరమని ఇలాంటి వాటిని ఆర్యవైశ్యులు అసలు నమ్మవద్దని నాగిళ్ల శ్రీనివాస్ సూచించారు. తదుపరి కోర్టు ఆదేశాలు వచ్చేవరకు ఆలయ నిర్మాణం ఆపివేయాలని కోర్టు ఆదేశించినట్లు పొరపాటున రాజకీయ నాయకుల మద్దతుతో ఎవరైనా అక్రమంగా నిర్మాణం చేస్తే హైకోర్టులో తాగిన మూల్యం చెందించుకోక తప్పదని హెచ్చరించారు.

# ఆటిజం చికిత్సలో స్టెమ్ సెల్ థెరపీ మోసం

**- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన డాక్టర్లు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆటిజం చికిత్సలో స్టెమ్ సెల్ థెరపీ వినియోగంపై సుప్రీంకోర్టు శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, ఆమోదం లేని ఈ విధానాన్ని వైద్యపరమైన మోసంగా (మాల్‌ప్రాక్టీస్) పరిగణిస్తామని తేల్చిచెప్పింది. ఈ తీర్పును ప్రముఖ వైద్య నిపుణులు స్వాగతించారు. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. ఆమోదం పొందిన క్లినికల్ ట్రయల్స్ వెలుపల రోగులపై స్టెమ్ సెల్స్ వాడటం అనైతికమని పేర్కొంది. శాస్త్రీయంగా నిరూపణ కాని చికిత్సను రోగులు ఒక హక్కుగా డిమాండ్ చేయలేరని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పుడు నమ్మకాలతో రోగులు చికిత్స పొందడం వైద్య నైతికతను పూర్తిగా ఉల్లంఘించడమేనని ధర్మాసనం అభిప్రాయపడింది.సుప్రీంకోర్టు నిర్ణయంపై ఢిల్లీ ఎయిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ మంజరి త్రిపాఠి హర్షం వ్యక్తం చేశారు. "ఆటిజంతో పాటు ఇతర నరాల సంబంధిత సమస్యలకు స్టెమ్ సెల్ థెరపీ పనిచేస్తుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. కానీ కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌లు రూ. 6 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు వసూలు చేస్తూ రోగులను మోసం చేస్తున్నాయి. ఈ తీర్పు ఇంకా ముందే వచ్చి ఉండాల్సింది" అని ఆమె అన్నారు. గతంలో 2022 డిసెంబరులోనే నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కూడా ఆటిజం చికిత్సకు స్టెమ్ సెల్ థెరపీని సిఫార్సు చేయడం లేదని స్పష్టం చేసింది. ఇటీవలి ఐసీఎంఆర్ నివేదిక కూడా ఇదే విషయాన్ని తేల్చిందని ఎయిమ్స్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ షెఫాలీ గులాటీ తెలిపారు. అయితే, స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలను సుప్రీంకోర్టు వ్యతిరేకించలేదు. నియంత్రిత క్లినికల్ ట్రయల్స్ రూపంలో పరిశోధనలు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. ఈ ట్రయల్స్‌లో పాల్గొనే స్వేచ్ఛ రోగులకు ఉంటుందని తెలిపింది. ఆటిజం ఉన్న ఎలుకలపై తాము పరిశోధనలు చేస్తున్నామని, అయితే క్లినికల్ ప్రాక్టీస్‌లో మాత్రం దీనిని వాడరాదని డాక్టర్ గులాటీ వివరించారు.

# గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

**- వ్యోమగాముల భద్రత దృష్ట్యా మానవరహిత రాకెట్ల ప్రయోగం**

**- మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి**

**- రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామన్న ఇస్రో ఛైర్మన్**



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) తొలి మానవరహిత అంతరిక్ష ప్రయాణ మిషన్ 'గగన్‌యాన్'కు సిద్ధమవుతున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన 8 వేలకు పైగా ప్రయోగాలు సఫలమయ్యాయని తెలిపారు. వ్యోమగాముల భద్రత దృష్ట్యా మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామని, గగన్‌యాన్ మిషన్ విజయవంతం చేయడమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. రెండో మానవరహిత రాకెట్ ప్రయోగం ఈ ఏడాది చివరలో ఉంటుందని తెలిపారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ చేపట్టగా, ఈ ప్రాజెక్టు తుది దశకు చేరిందని అన్నారు. మానవ సహిత స్పేస్ మిషన్‌లో భాగంగా మార్చిలో వ్యోమమిత్ర రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. కాగా, 2027లో చేపట్టనున్న గగన్‌యాన్ మిషన్ కోసం వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా ఎంపికైన విషయం తెలిసిందే.

# కేజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యంతో బిడ్డను కోల్పోయానంటూ మహిళ ఆవేదన

**- విశాఖ విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు**

**- బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరిన బాధితురాలు**

**- సోమవారం నాడు సచివాలయానికి రావాలని కుటుంబానికి ఆహ్వానం**



అమరావతి (ప్రశ్న న్యూస్) విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్) వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గర్భంలోనే తన శిశువు మృతి చెందిందని ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెంటనే స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనలాంటి పరిస్థితి మరెవరికీ రాకుండా చూడాలని ఆ మహిళ కన్నీటితో వేడుకుంది. ఆమె వేదనకు చలించిన పవన్ కల్యాణ్, బాధిత కుటుంబాన్ని సోమవారం సచివాలయంలోని తన కార్యాలయానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం రాత్రి తన విశాఖ పర్యటన ముగించుకుని తిరిగి వెళుతున్న సమయంలో విమానాశ్రయంలో పట్నాల ఉమాదేవి అనే మహిళ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశారు. గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ప్రసవం కోసం తాను కేజీహెచ్‌లో చేరానని, అప్పటి నుంచి వైద్యులు, సిబ్బంది తన పట్ల అత్యంత నిర్లక్ష్యంగా, అమానవీయంగా ప్రవర్తించారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. "కాన్పుకు ఇచ్చిన గడువు ముగిసిపోయిందని చెప్పినా వారు పట్టించుకోలేదు. సాధారణ ప్రసవం పేరుతో నన్ను నరకయాతనకు గురిచేశారు. నా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు పదేపదే చెప్పినా వినలేదు. పైగా మాపై తీవ్ర పదజాలంతో దూషించారు. ప్రసవ సమయంలో ఒకరు నా గుండెలపైకి ఎక్కి కూర్చొని నొప్పితో విలవిల్లాడుతున్నా కనికరించలేదు" అని ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో సిజేరియన్ చేయకపోవడం వల్లే తాను మృత శిశువుకు జన్మనివ్వాల్సి వచ్చిందని ఆమె వాపోయారు. కేజీహెచ్ సిబ్బంది తీరు వల్ల తనకు శారీరక హింసతో పాటు జీవితాంతం మరిచిపోలేని మానసిక వేదన మిగిలిందని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఉమాదేవి ఆవేదనను ఓపికగా విన్న పవన్ కల్యాణ్ వెంటనే చలించిపోయారు. ఆమెకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ విషయంపై పూర్తి వివరాలు తెలుసుకుని, తగిన న్యాయం చేసేందుకు ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను తన కార్యాలయానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ ఘటనపై వైద్యారోగ్య శాఖ అధికారులతో కూడా మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# కుప్పకూలిన బంగారం, వెండి

**- భారీగా పతనమైన ధరలు**



ముంబై (ప్రశ్న న్యూస్) బంగారం, వెండి ధరలు శనివారం భారీగా పతనమయ్యాయి. గత కొన్ని రోజులుగా ఈ ఖరీదైన లోహాలు అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. దీంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపుతుండటంతో రెండు రోజులుగా బంగారం, వెండి ధరలు క్షీణిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ రోజు కిలో వెండి ధర 19 శాతం నష్టపోయి రూ.3.12 లక్షలు, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 2 శాతం క్షీణించి రూ.1.65 లక్షలు పలికింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం వెండి ధర కిలో 18.85 శాతం లేదా రూ.72,500 క్షీణించి రూ.3,12,000 పలికింది. గత కొన్ని రోజులుగా ఆకాశాన్నంటేలా పెరుగుతున్న వెండి ధరలు వరుసగా రెండు రోజులు భారీ నష్టాన్ని చూశాయి. గురువారం కిలో వెండి ధర రూ.4 లక్షలు దాటింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు 11 శాతం పడిపోయాయి. కామెక్స్‌లో వెండి ధర 31 శాతం క్షీణించింది.

# దంచికొట్టనున్న ఎండలు.. కాచుకోమంటున్న సూరీడు

**– ఈ ఎండాకాలం ప్రజలకు సవాలే**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ తప్పించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పగటి వేళలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి టెంపరేచర్స్ చేరాయి. ఫిబ్రవరి నెలలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఈసారి అత్యధిక స్థాయిలో ఎండల తీవ్రత ఉంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. భారత్ లో ఇటీవల వానలు, చలి ఏ తరహాలో అయితే ఎక్కువగా కనిపించాయో ఎండలు కూడా అదే స్థాయిలో ఉంటాయని, వాతావరణంలో మార్పులు, కాలుష్యం వంటి ప్రభావంతో ఉష్ణోగ్రతలు గరిష్టానికి పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

**- ఏపీలో గరిష్ట ఉష్ణోగ్రతలు..**

ఆంధ్రప్రదేశ్ లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే కొన్ని చోట్ల 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, పల్నాడు, కృష్ణా జిల్లాలో ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. ఇక పొగమంచు తీవ్రత కూడా తగ్గింది. భానుడు ఉదయం ఏడు గంటల నుంచే భగభగమంటున్నాడు. మధ్యాహ్నం పూట ప్రజలు బయటకు రాకపోవడమే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి. అయితే ఏజెన్సీ ప్రాంతాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మాత్రం ఒకింత చలి వాతావరణం నెలకొంది.

**- ఒక్కసారిగా మారడంతో..**

తెలంగాణలో కూడా వాతావరణం మారింది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. విద్యుత్తు శాఖ నిర్వహణ పేరిట అప్పుడే గంటల కొద్ది విద్యుత్తు సరఫరాలో కోత విధించడం ప్రారంభించింది. విద్యుత్తు వినియోగం ఒక్కసారిగా పెరగడంతో మీటర్లు గిరాగిరా తిరుగుతున్నాయి. ఇక ఉదయం, తెల్లవారు జామును మాత్రం ఒకింత చలి వాతావరణం నెలకొంది. హైదరాబాద్ వంటి నగరంలోనూ పగటి ఉష్ణోగ్రతలు గరిష్టానికి చేరుకున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఇక సూర్యాపేట, కొత్త గూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588